# భజగోవిందం

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు



శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు



# భజగోవిందం

## సద్గురు శ్రీనాన్నగారి అనుగ్రహ భాషణములు

సంకలనం
కె.వి.రమణ, ఐ.ఎ.యస్

ప్రకాశకులు:
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు

భజగోవిందం
ప్రథమ ముద్రణ: డిసెంబర్, 2020
ప్రతులు: 2000
హక్కులు: ప్రకాశకులవి

ప్రకాశకులు:
శ్రీ రమణ క్షేత్రం, జిన్నూరు

ప్రతులకు:
1. శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు – 534 265, పశ్చిమ గోదావరి జిల్లా
ఫోన్: 9848523805

2. వి. సునీల్,
శ్రీ రవికాంత్ ఏజన్సీస్,
మండపేట – 533 308, తూర్పు గోదావరి జిల్లా
ఫోన్: 7013991234

గ్రాఫిక్స్:
శ్రీ గాయత్రీదేవి గ్రాఫిక్స్,
గాంధినగర్, విజయవాడ – 520 003
ఫోన్: 9440636178

ముద్రణ:
శ్రీ రమణ ప్రింటర్స్,
స్వామి వీధి, గాంధినగర్, విజయవాడ – 520 003
ఫోన్: 9985068630

# గురు ధ్యానం

**దక్షిణామూర్తి సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।**
**అస్మదాచార్య పర్యంతాం వందే గురు పరంపరామ్ ॥**

దక్షిణామూర్తితో ఆరంభమై, శంకరాచార్యులవారు మధ్యములుగా, ప్రస్థుతం ఉపదేశం ఇచ్చిన సద్గురు శ్రీనాన్నగారు వరకు గల గురుపరంపరకు నమస్కరిస్తున్నాను.

**గురుః బ్రహ్మా గురుః విష్ణుః గురుః దేవో మహేశ్వరః ।**
**గురుః ఏవ పరం బ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః ॥**

గురువు బ్రహ్మా, గురువు విష్ణువు, గురువు మహేశ్వరుడు, గురువే పరబ్రహ్మము. అట్టి శ్రీ గురువుకు నమస్కరిస్తున్నాను.

# విషయసూచిక


| | |
|---|---|
| ముందుమాట | 1 |
| భజగోవిందం శ్లోకములు | 3 |
| సద్గురు శ్రీనాన్నగారి తొలిపలుకులు | 11 |
| 1. భజగోవిందం భజగోవిందం | 12 |
| 2. మూఢ జహీహి | 15 |
| 3. నారీస్థనభర | 18 |
| 4. నళినీదళగత | 20 |
| 5. యావద్విత్తోపార్జన | 22 |
| 6. యావత్పవనో నివసతి | 24 |
| 7. బాలస్తావత్ క్రీడాసక్తః | 26 |
| 8. కా తే కాంతా కస్తే పుత్రః | 28 |
| 9. సత్సంగత్వే | 30 |
| 10. వయసి గతే | 32 |
| 11. మా కురు ధన జన | 34 |
| 12. దినయామిన్యౌ | 36 |
| 13. కా తే కాంతా ధనగత | 39 |

| | |
|---|---|
| 14. జటిలో ముండీ | 41 |
| 15. అంగం గళితం | 43 |
| 16. అగ్రే వహ్నిః | 45 |
| 17. కురుతే గంగాసాగర | 47 |
| 18. సురమందిర తరుమూల | 49 |
| 19. యోగరతో వా | 51 |
| 20. భగవద్గీతా | 53 |
| 21. పునరపి జననం | 55 |
| 22. రథ్యా చర్పట | 57 |
| 23. కస్త్వం కోఽహం | 59 |
| 24. త్వయి మయి | 64 |
| 25. శత్రౌ మిత్రే | 67 |
| 26. కామం క్రోధం | 69 |
| 27. గేయం గీతా నామ | 72 |
| 28. సుఖతః క్రియతే | 74 |
| 29. అర్థమనర్థం | 76 |
| 30. ప్రాణాయామం | 78 |
| 31. గురుచరణాంబుజ | 80 |

# ముందుమాట

ఆధ్యాత్మిక ప్రస్థానంలో అంటే ఆధ్యాత్మిక ప్రయాణంలో మార్గనిర్దేశం చేయడానికి హిందూ తత్త్వ శాస్త్రం "**ప్రస్థాన త్రయం**" అని మూడు గ్రంథాలను బహుకరించింది. అవి: ఉపనిషత్తులు, బ్రహ్మసూత్రాలు, భగవద్గీత. ఆ ప్రస్థాన త్రయం గ్రంథాలలోని సూక్ష్మమైన విషయాలను అర్థం చేసుకోవడం కష్టం. అందువలన వాటికంటే ముందుగా చదవవలసిన "**ప్రకరణ గ్రంథాలు**" అనువాటిని మహాత్ములు అందుబాటులో ఉంచారు.

మానవులందరూ అన్ని వేళలా ఆనందంగా ఉండాలని కోరుకుంటారు. తాము ఆనందంగా లేనప్పుడు అందుకు తగిన మార్పు వస్తే బాగుంటుంది అనుకుంటారు. కొంచెం పరిణితి చెందాక, నిశితంగా ఆలోచిస్తే, ఇతరులలో కాదు, పరిస్థితులలో కాదు, తమలోనే ఆ మార్పు రావాలి అని తెలుస్తుంది. ఆ మార్పుకోసం శంకరాచార్యులవారు, వారి శిష్యగణం చెప్పిన ఆణిముత్యాలవంటి శ్లోకాల సమాహరమే అద్భుతమైన ప్రకరణ గ్రంథం "**మోహముద్గరం**".

మోహం అంటే అజ్ఞానం, ఆత్మజ్ఞానం లేకపోవడం. అటువంటి మోహాన్ని నశింపచేస్తుందని ఈ గ్రంథానికి మోహముద్గరం అని అసలు పేరు. మోహముద్గరంలోని శ్లోకాలను పారాయణం చేసేటప్పుడు, ప్రతి శ్లోకానికి చివర "భజగోవిందం, భజగోవిందం, గోవిందం భజ మూఢమతే" అని పాడుతుంటారు. అందువలన మోహముద్గరం ప్రకరణ గ్రంథానికి "**భజగోవింద స్తోత్రం**", "**భజగోవిందం**" అనే పేర్లు వాడుకలోకి వచ్చాయి.

తత్త్వశాస్త్ర గ్రంథాలలోని విషయాలను సద్గురువు బోధించగా విని సరిగ్గా అవగాహన చేసుకోవాలి. ఈ సందర్భంలో "**సద్గురు శ్రీ నాన్నగారు**" విశేషాలు సంక్షిప్తంగా:

తమ ఆత్మబంధువైన శ్రీ భూపతిరాజు లక్ష్మీ నరసింహరాజుగారిని భక్తులు ప్రేమతో "నాన్నగారు" అని పిలుచుకుంటారు. వారు 1934 సంవత్సరంలో సెప్టెంబర్ 23 వ తేదీన జన్మించారు. వారి స్వగ్రామం పశ్చిమ గోదావరి జిల్లాలోని జిన్నూరు. యాభై ఏడు సంవత్సరాలపాటు (1960 నుండి 2017 వరకు) నిర్విరామంగా సద్గురు శ్రీ నాన్నగారు వివిధ ప్రాంతాలలో అనేక వేల సత్సంగాలు చేసారు.

సూక్ష్మమైన విషయాలను అత్యంత సరళంగా, లలిత లలితంగా, మృదుమధురంగా, హృదయంలో హత్తుకుపోయేటట్లు చెప్పడం, వారి ప్రేమలో తమను తాము మరచిపోయి సత్సంగంలో అందరూ లీనమైపోయేలాగా చేయడం నాన్నగారికే సాధ్యం!

"భజగోవిందం"పై వారి బోధ వినాలని ఉందని విజ్ఞప్తి చేసినప్పుడు నాన్నగారు చేసిన అనుగ్రహ భాషణలను ఈ పుస్తకంలో పొందుపరచడం జరిగింది.

గురు ధ్యానం చేస్తూ, భజగోవిందంకు సద్గురు శ్రీ నాన్నగారు చెప్పిన అనుగ్రహ భాషణల సారాన్ని నిత్యం మననం చేసుకొంటూ, అద్వైతానుభూతివైపు మనం వేసే అడుగులే "**గురుదక్షిణ**"గా సమర్పించుకుందాం!

**కె.వి.రమణ**

# భజగోవిందం శ్లోకములు

భజగోవిందం భజగోవిందం
గోవిందం భజ మూఢమతే ।
సంప్రాప్తే సన్నిహితే కాలే
నహి నహి రక్షతి డుకృఞ్ కరణే ॥ ॥భజ॥ 1

మూఢ జహీహి ధనాగమ తృష్ణాం
కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్ ।
యల్లభసే నిజకర్మోపాత్తం
విత్తం తేన వినోదయ చిత్తమ్ ॥ ॥భజ॥ 2

నారీస్థనభర నాభిదేశం
దృష్ట్వా మాగా మోహావేశమ్ ।
ఏ తన్మాంస వసాది వికారం
మనసి విచింతయ వారం వారమ్ ॥ ॥భజ॥ 3

నళినీదళగత జలమతి తరళం
తద్వజ్జీవితమతిశయ చపలమ్ ।
విద్ధి వ్యాధ్యభిమానగ్రస్తం
లోకం శోకహతం చ సమస్తమ్ ॥ ॥భజ॥ 4

యావద్విత్తోపార్జన సక్తః
తావన్నిజపరివారో రక్తః ।
పశ్చాజ్జీవతి జర్జర దేహే
వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే ॥ ॥భజ॥ 5

యావత్పవనో నివసతి దేహే
తావత్ పృచ్ఛతి కుశలం గేహే ।
గతవతి వాయౌ దేహా పాయే
భార్యా భిభ్యతి తస్మిన్ కాయే ॥ ॥భజ॥ 6

బాలస్తావత్ క్రీడాసక్తః
తరుణస్తావత్ తరుణీసక్తః ।
వృద్ధస్తావత్ చింతాసక్తః
పరే బ్రాహ్మణి కోఽపి న సక్తః ॥ ॥భజ॥ 7

కా తే కాంతా కస్తే పుత్రః
సంసారోఽయమతీవ విచిత్రః ।
కస్య త్వం వా కుత ఆయాతః
తత్త్వం చింతయ తదిహ భ్రాతః ॥ ॥భజ॥ 8

సత్సంగత్వే నిస్సంగత్వం
నిస్సంగత్వే నిర్మోహత్వమ్ ।
నిర్మోహత్వే నిశ్చలతత్త్వం
నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ॥ ॥భజ॥ 9

వయసి గతే కః కామవికారః
శుష్కే నీరే కః కాసారః ।
క్షీణే విత్తే కః పరివారో
జ్ఞాతే తత్త్వే కః సంసారః ॥ ॥భజ॥ 10

మా కురు ధన జన యౌవ్వన గర్వం
హరతి నిమేషాత్ కాలః సర్వమ్ ।
మాయామయమిదమఖిలం హిత్వా
బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా ॥ ॥భజ॥ 11

దినయామిన్యౌ సాయం ప్రాతః
శిశిర వసంతౌ పునరాయాతః ।
కాలః క్రీడతి గచ్ఛత్యాయుః
తదపి న ముంచత్యాశావాయుః ॥ ॥భజ॥ 12

కా తే కాంతా ధనగత చింతా?
వాతుల కిం తవ నాస్తి నియంతా ।
త్రిజగతి సజ్జన సంగతిః ఏకా
భవతి భవార్ణవ తరణే నౌకా ॥ ॥భజ॥ 13

జటిలో ముండీ లుంచిత కేశః
కాషాయాంబర బహుకృత వేషః ।
పశ్యన్నపి చ న పశ్యతి మూఢః
ఉదర నిమిత్తం బహుకృత వేషః ॥ ॥భజ॥ 14

అంగం గళితం పలితం ముండం
దశన విహీనం జాతం తుండమ్ ।
వృద్ధోయాతి గృహీత్వా దండం
తదపి న ముంచత్యాశా పిండమ్ ॥ ॥భజ॥ 15

అగ్రే వహ్నిః పృష్ఠే భానుః
రాత్రౌ చుబుక సమర్పిత జానుః ।
కరతల భిక్షస్తరుతల వాసః
తదపి న ముంచత్యాశాపాశః ॥ ॥భజ॥ 16

కురుతే గంగాసాగర గమనం
వ్రత పరిపాలనమథవా దానమ్ ।
జ్ఞానవిహీనః సర్వమతేన
ముక్తిం న భజతి జన్మశతేన ॥ ॥భజ॥ 17

సురమందిర తరుమూల నివాసః
శయ్యా భూతలమజినం వాసః ।
సర్వ పరిగ్రహ భోగ త్యాగః
కస్య సుఖం న కరోతి విరాగః ॥ ॥భజ॥ 18

యోగరతో వా భోగరతో వా
సంగరతో వా సంగవిహీనః ।
యస్య బ్రహ్మణి రమతే చిత్తం
నందతి నందతి నందత్యేవ ॥ ॥భజ॥ 19

భగవద్గీతా కించిదధీతా
గంగాజల లవకణికా పీతా ।
సకృదపి యేన మురారి సమర్చా
క్రియతే తస్య యమాపి న చర్చా ॥ ॥భజ॥ 20

పునరపి జననం పునరపి మరణం
పునరపి జననీ జఠరే శయనమ్ ।
ఇహ సంసారే బహుదుస్తారే
¿ã] jŸ ©ఽపారే పాహి మురారే ॥ ॥భజ॥ 21

రథ్యా చర్పట విరచిత కంథః
పుణ్యాపుణ్య విసర్జిత పంథః ।
యోగీ యోగ నియోజిత చిత్తః
రమతే బాలోన్మత్తవదేవ ॥ ॥భజ॥ 22

కస్త్వం కోఽహం కుత ఆయాతః
కా మే జననీ కో మే తాతః ।
ఇతి పరిభావయ సర్వమసారం
విశ్వం త్యక్త్వా స్వప్న విచారమ్ ॥ ॥భజ॥ 23

త్వయి మయి చాన్యత్రైకో విష్ణుః
వ్యర్థం కుప్యసి మయ్యసహిష్ణుః ।
భవ సమచిత్తః సర్వత్ర త్వం
వాంఛస్య చిరాద్యది విష్ణుత్వమ్ ॥ ॥భజ॥ 24

శత్రౌ మిత్రే పుత్రే బంధౌ
మా కురు యత్నం విగ్రహ సంధౌ ।
సర్వస్మిన్నపి  పశ్యాత్మానం
సర్వత్రోత్సృజ భేదాజ్ఞానమ్ ॥ ॥భజ॥ 25

కామం క్రోధం లోభం మోహం
Ôశ్ ±ఽ ఽ త్మానం పశ్యతి సోఽ హమ్ ।
ఆత్మజ్ఞాన విహీన మూఢాః
తే పచ్యన్తే నరక నిగూఢాః ॥ ॥భజ॥ 26

గేయం గీతా నామ సహస్రం
ధ్యేయం శ్రీపతి రూపమజస్రమ్ ।
నేయం సజ్జన సంగే చిత్తం
దేయం దీనజనాయ తు విత్తమ్ ॥ ॥భజ॥ 27

సుఖతః క్రియతే రామా భోగః
పశ్చాద్ధంత శరీరే రోగః ।
యద్యపి లోకే మరణం శరణం
తదపి న ముంచతి పాపాచరణమ్ ॥ ॥భజ॥ 28

అర్థమనర్థం భావయ నిత్యం
నాస్తి తతః సుఖలేశః సత్యమ్ ।
పుత్రాదపి ధనభాజాం భీతిః
సర్వత్రైషా విహితా రీతిః ॥ ॥భజ॥ 29

ప్రాణాయామం ప్రత్యాహారం
నిత్యానిత్య వివేక విచారమ్ ।
జాప్యసమేత సమాధి విధానం
కుర్వవధానం మహదవధానమ్ ॥ ॥భజ॥ 30

గురుచరణాంబుజ నిర్భర భక్తః
సంసారాత్ అచిరాత్ భవ ముక్తః ।
సేంద్రియ మానస నియమాదేవం
ద్రక్ష్యసి నిజ హృదయస్థం దేవమ్ ॥ ॥భజ॥ 31

✹✹✹

# భజగోవిందం

## తొలిపలుకులు

భజగోవిందంలో శంకరాచార్యులవారు వైరాగ్యం, భక్తి, జ్ఞానం, విచారణ, సాధన గురించి అద్భుతంగా చెప్పారు.

చెరువుగట్టు మీద ఒక బ్రాహ్మణుడు ఏదో సంస్కృత వ్యాకరణం బట్టీ పడుతున్నాడు. అది చూసి ఆచార్యులవారు వాడిని ప్రేమగా తిడుతూ పన్నెండు శ్లోకాలు చెప్పారు. ఈ పన్నెండు శ్లోకాలను "ద్వాదశ మంజరికా స్తోత్రం" అంటారు.

అంతటితో ఆగకుండా వారి వెనక ఉన్న శిష్యుల్ని 'మీరు కూడా కొన్ని శ్లోకాలు చెప్పండి, అందరికీ ఉపయోగపడతాయి' అని ఆచార్యులవారు అన్నారు. శిష్యులు పద్నాలుగు శ్లోకాలు చెప్పాక శంకరులు మరో అయిదు శ్లోకాలు చెప్పారు.

అలా చెప్పిన వారందరూ జ్ఞానులూ, శంకరుల శిష్యులే కాబట్టి మొత్తం ముప్పై ఒకటి శ్లోకాలు కలిపి శంకరాచార్యులవారు చెప్పిన భజగోవిందం అని పరిగణించబడుతోంది.

భక్తులందరూ భజగోవిందం శ్లోకాలను నిత్యం మననం చేసుకుంటూ తరించవచ్చు.

**సద్గురు శ్రీనాన్నగారు**

# భజగోవిందం

**భజగోవిందం భజగోవిందం**
**గోవిందం భజ మూఢమతే ।**
**సంప్రాప్తే సన్నిహితే కాలే**
**నహి నహి రక్షతి డుకృఞ్ కరణే ॥ ॥భజ॥ 1**

| | | |
|---|---|---|
| గోవిందం | = | గోవిందుని, |
| భజ | = | భజన చేయుము, |
| గోవిందం | = | గోవిందుని, |
| భజ | = | భజన చేయుము, |
| మూఢమతే | = | ఓ మూఢమతి! |
| గోవిందం | = | గోవిందుని, |
| భజ | = | భజన చేయుము. |
| కాలే | = | మరణకాలం, |
| సన్నిహితే | = | సమీపమునకు, |
| సంప్రాప్తే | = | వచ్చినప్పుడు, |
| డుకృఞ్ కరణే | = | డుకృఞ్ కరణే వంటి వ్యాకరణపు మాటలు, |
| నహి నహి రక్షతి | = | (నిన్ను) ఏ మాత్రం రక్షించలేవు. |

**గోవిందుని భజన చేయుము, గోవిందుని భజన చేయుము. ఓ మూఢమతి! గోవిందుని భజన చేయుము. మరణకాలం సమీపించినప్పుడు డుకృఞ్ కరణే వంటి వ్యాకరణపు మాటలు నిన్ను ఏ మాత్రం రక్షించలేవు.**

గోవిందుడు అంటే భగవంతుడు, సర్వవ్యాపి అయిన ఆత్మ. భజ అంటే సేవించడం. శంకరులు భజగోవిందం అని మనకి ఎందుకు చెప్పారు అన్న విషయం తెలుసుకోవాలంటే శ్రీకృష్ణభగవానుడు చెప్పిన రెండు శ్లోకములు మననం చేయదగినవి. అవి:

**అహం సర్వస్య ప్రభవో మత్తః సర్వం ప్రవర్తతే ।**
**ఇతి మత్వా భజంతే మాం బుధాః భావసమన్వితాః ॥** (భగవద్గీత 10-8)

సర్వజగత్తు నావలననే పుడుతున్నది, ప్రవర్తిస్తున్నది అని తెలుసుకొని, పరమార్థ భావం గలవారై బుధులు (జ్ఞానులు) నన్ను భజించుచున్నారు.

**తేషాం సతతయుక్తానాం భజతాం ప్రీతిపూర్వకమ్ ।**
**దదామి బుద్ధియోగం తం యేన మాం ఉపయాంతి తే ॥** (భగవద్గీత 10-10)

ఎల్లప్పుడు నాయందు మనస్సు గలవారై ప్రేమతో నన్ను భజించునట్టి వారికి, దేనిచేత వారు నన్ను పొందగలరో ఆ బుద్ధియోగమును ప్రసాదించుచున్నాను.

'మూఢుడు' అంటే ఏమీ తెలియనివాడు. 'మూర్ఖుడు' అంటే కొంచెం తెలిసి అంతా తెలుసు అని అనుకునేవాడు. ఏమీ తెలియని మూఢునికి హితోపదేశం చేయవచ్చును గానీ, మూర్ఖునికి హితోపదేశం చేయడం బ్రహ్మదేవునికి కూడా సాధ్యం కాదని భర్తృహరి నీతి సుభాషితం.

"కొద్దిపాటి జ్ఞానం మాత్రమే కలిగి ఉన్నప్పుడు మదగజంలాగా సర్వము తెలిసినవాడినని విర్రవీగాను. తరువాత పండితులవద్ద కొంచెం జ్ఞానాన్ని పొంది నేను మూర్ఖుడినని, నాకేమీ తెలియదని గ్రహించి, గర్వమును వదిలి సుఖంగా ఉన్నాను." (భర్తృహరి నీతి సుభాషితం-7)

డుకృణ్ కరణే వంటి వ్యాకరణపు మాటలు లౌకిక విద్యలను సూచిస్తాయి. అవన్నీ పొట్టకూటికోసమే. ఆ లౌకిక విద్యలతో మీరు ఆగిపోకూడదు, ఎందుకంటే అవి మిమ్ముల్ని మరణంనుండి రక్షించలేవు.

ప్రహ్లాదుడు చెప్పినట్లు చావులేని చదువు చదవాలి! భక్తిలో మునిగి తేలితే అంతా జ్ఞానమయమే! అందుకే శంకరులు పరాభక్తియే జ్ఞానం అని వివేకచూడామణిలో చెప్పారు.

నన్నే ఆరాధిస్తూ, నా మీదే మనసు పెట్టి నాకు శరణాగతి చెందితే నేనే మిమ్ముల్ని రక్షిస్తానని గీతలో శ్రీక్రిష్ణుడు చెప్పాడు కదా!

"అచ్యుత, అనంత, గోవింద, మాధవ, కేశవ, దామోదర, నారాయణ, నారాయణ, నారాయణ" అని మనం మంత్రం చెప్పుకున్నాం కదా! ఆ మంత్రాన్ని జపిస్తూ ఉండడమే భజగోవిందం!

శంకరాచార్యులవారికి ఆత్మజ్ఞానం, బ్రహ్మానందం అనుభవంతో బాటు, పాండిత్యం కూడా ఉన్నాయి. మిమ్ముల్ని కంగారుపెట్టకుండా తనతో పాటు తీసుకువెళతారు. మీరు అటూ, ఇటూ వెళతానంటే ఊరుకోరు, తిడతారు. మహాత్ముల తిట్లు కూడా లోక కళ్యాణం కోసమే కదా!

✷ ✷ ✷

**మూఢ జహీహి ధనాగమ తృష్ణాం**
**కురు సద్బుద్ధిం మనసి వితృష్ణామ్ ।**
**యల్లభసే నిజకర్మోపాత్తం**
**విత్తం తేన వినోదయ చిత్తమ్ ॥ ॥భజ॥ 2**

| | | |
|---|---|---|
| ధనాగమ | = | ధన + ఆగమ |
| యల్లభసే | = | యత్ + లభసే |
| నిజకర్మోపాత్తం | = | నిజ + కర్మ + ఉపాత్తం |

| | | |
|---|---|---|
| మూఢ | = | ఓ మూఢుడా! |
| ధన ఆగమ | = | ధనం ఇంకా ఇంకా రావాలి అను, |
| తృష్ణాం | = | కోరికను, |
| జహీహి | = | వదిలిపెట్టు, |
| మనసి | = | మనస్సులో, |
| వితృష్ణాం | = | ఆశ అనునది లేని, |
| సద్బుద్ధిం | = | సత్ బుద్ధిని (ఈశ్వర బుద్ధిని), |
| కురు | = | అలవాటు చేసుకో, |
| నిజ | = | నీవు చేసిన, |
| కర్మ ఉపాత్తం | = | (ధర్మబద్ధమైన) కర్మఫలంగా, |
| యత్ | = | ఎంత, |
| విత్తం | = | ధనం, |
| లభసే | = | లభిస్తుందో, |
| తేన | = | ఆ ధనంతో, |
| చిత్తం | = | మనస్సులో, |
| వినోదయ | = | తృప్తిచెందు. |

**ఓ మూఢుడా! ధనం ఇంకా ఇంకా రావాలి అను కోరికను వదిలిపెట్టు. మనస్సులో ఆశ అనునుది లేని సత్ బుద్ధిని (ఈశ్వర బుద్ధిని) అలవాటు చేసుకో. నీవు చేసిన (ధర్మబద్ధమైన) కర్మఫలంగా ఎంత ధనం లభిస్తుందో, ఆ ధనంతో మనస్సులో తృప్తిచెందు.**

ఈషణత్రయం అంటే మూడు కోరికలు. అవి:

1. దారేషణ – భార్యమీద కోరిక.
2. పుత్రేషణ – సంతానంమీద కోరిక.
3. ధనేషణ – ధనంమీద కోరిక.

ఈషణత్రయం గురించి వేమన ఇలా అన్నాడు:

*ఈషణత్రయంబు నెడపంగ నేరక*
*మోహరాశిలోన మునిగియుండు*
*జనులకెట్లు మోక్షసౌఖ్యంబు గల్గును*
*విశ్వదాభిరామ వినురవేమ*

ఈషణత్రయమును వదిలించుకోలేక మోహంలోన మునిగినవారికి ముక్తి కలుగదు అని భావం.

మనం చేసిన ధర్మబద్ధమైన కర్మకు దైవానుగ్రహంవలన లభించిన ఫలముతో తృప్తిచెందడం అనేది చాలా ముఖ్యం. ఈ విషయమై భర్తృహరి ఇలా అన్నారు:

"నుదుట వ్రాసిన కొద్దో గొప్పో ధనం, ఆ వ్యక్తి ఎక్కడ ఉన్నప్పటికీ తప్పకుండా పొందుతాడు. మేరుపర్వతంపై ఉన్నా, అతడు అంతకంటే ఎక్కువ పొందలేడు. అందువలన, ధనవంతులను చూసి దిగులు పడకూడదు. బావిలో ముంచినా, సముద్రంలో ముంచినా కుండలో పట్టేది ఆ కడివెడి నీళ్లే."

(భర్తృహరి నీతిశతకం–40)

## శ్రీ నాన్నగారు

ఆచార్యులవారు మళ్ళీ మళ్ళీ మూఢుడా అని ఎందుకు తిడుతున్నారంటే మీకు అసలు విషయం ఏమీ తెలియదని పదే పదే గుర్తుచేసుకొని మీరు గురువు చెప్పే మాటలు శ్రద్ధగా వినాలని!

బ్రతకడానికి, ఇంకా కొన్ని కనీస సుఖాలు అనుభవించడానికి అవసరమైనంతవరకు డబ్బు సంపాదించాలి అనుకోవడంలో తప్పులేదు. అంతకుమించి ఇంకా ధనం కావాలని పరుగులు పెట్టవద్దు అని శంకరులు చెబుతున్నారు.

అంతేకాదు, మనస్సులో ఆశ అంటే కోరిక లేకుండా చూసుకోమని అంటున్నారు. అది అంత తేలిక కాదు కదా, ఆ విషయం ఆయనకు తెలుసు. అందుకే మనస్సులో ఆశ లేకుండా చూసే సద్బుద్ధిని అలవాటు చేసుకో అని చెబుతున్నారు.

ఉన్నదానితో తృప్తిపడడం చాలా ముఖ్యం. లేకపోతే అసూయ వచ్చేస్తుంది. అర్జునుడు అనసూయడు అంటే అసూయ లేనివాడు కాబట్టి శ్రీకృష్ణుడు వాడికి భగవద్గీత చెప్పాడు! అసూయ మీలో ఉంటే మీరు పాడైపోతారు.

అటూ, ఇటూ వెళతానంటే శంకరులు ఊరుకోరు అని చెప్పుకున్నాం కదా! అంతే కాదు, మీరు ఎలా ముందుకు వెళ్ళాలో, ఎలా సాధన చేయాలో పూసగుచ్చినట్లు చెబుతారు. అందుకే ఆయన అచార్యులవారు అయ్యారు, జగద్గురువు అయ్యారు.

✷ ✷ ✷

**నారీస్థనభర నాభిదేశం**
**దృష్ట్వా మాగా మోహావేశమ్ ।**
**ఏ తన్మాంస వసాది వికారం**
**మనసి విచింతయ వారం వారమ్ ॥** **॥భజ॥** **3**

| | | |
|---|---|---|
| ఏతన్మాంస | = | ఏతత్ + మాంస |
| వసాది | = | వస + ఆది |

| | | |
|---|---|---|
| నారీ | = | స్త్రీల, |
| స్తనభర | = | వక్షోజములు, |
| నాభిదేశం | = | బొడ్డు ప్రాంతమును, |
| దృష్ట్వా | = | చూసి, |
| మోహావేశం | = | మోహావేశములు, |
| మాగా | = | పొందకు, |
| ఏతత్ | = | అదంతయు, |
| మాంస | = | మాంసము, |
| వస | = | క్రొవ్వు, |
| ఆది | = | మొదలగువాని, |
| వికారం | = | వికారమేనని, |
| మనసి | = | మనస్సునందు, |
| వారం వారం | = | మాటిమాటికి, |
| విచింతయ | = | బాగా గుర్తుంచుకో! |

**స్త్రీల వక్షోజములు, బొడ్డు ప్రాంతమును చూసి మోహావేశములు పొందకు. అదంతయు మాంసము, కొవ్వు మొదలగు వాని వికారమేనని మనస్సునందు మాటిమాటికి బాగా గుర్తుంచుకో!**

ఆ శరీరము ఒక అస్థిపంజరం. నవరంధ్రముల ఓటికుండ. రక్తమాంసములు చర్మముతో కప్పబడి దేహమనే ఈ ఎముకలగూడు పైకి కనిపిస్తున్నట్లు సౌందర్యమయం కాదు. తరచి చూస్తే అది దుర్గంధపూరిత మలినకూపం.

శరీరం పృధివి (మట్టి), జలం, అగ్ని, వాయువు, ఆకాశం అను పంచభూతములతో కూడి వికారం (మార్పు) చెందుతూ ఉంటుంది.

జాయతే (పుట్టడం),
అస్తి (ఉండడం),
వర్థతే (పెరగడం),
విపరిణమతి (మార్పుచెందడం),
అపక్షీయతే (క్షీణించడం),
వినశ్యతి (లేకపోవడం) అనునవి ఆరు వికారములు.

## శ్రీ నాన్నగారు

"కీర్తి కాంతా కనకం" – ఈ మూడూ ప్రమాదకరమైనవి అన్నారు. వీటిలో ముందు కనకం అంటే ధన వ్యామోహం గురించి ఆచార్యులు చెప్పారు.

తరువాత కాంత అంటే స్త్రీ – పురుష వ్యామోహం గురించి చెబుతున్నారు. దానినుండి బయటపడడానికి మనం ఎప్పుడూ మరచిపోతుండే ఒక నిజాన్ని పదే పదే జ్ఞాపకం చేసుకోమని ఆచార్యులు అంటున్నారు.

ఆ నిజం ఏమిటంటే ఈ దేహం మాంసం, కొవ్వుల వికారం మాత్రమే అన్న విషయం!

✷✷✷

**నళినీదళగత జలమతి తరళం**
**తద్వజ్జీవితమతిశయ చపలమ్ ।**
**విద్ధి వ్యాధ్యభిమానగ్రస్తం**
**లోకం శోకహతం చ సమస్తమ్ ॥ ॥భజ॥ 4**

| | | |
|---|---|---|
| జలమతి | = | జలం + అతి |
| తద్వజ్జీవితమతిశయ | = | తద్వత్ + జీవితం + అతిశయ |
| వ్యాధ్యభిమానగ్రస్తం | = | వ్యాధి + అభిమానగ్రస్తం |

| | | |
|---|---|---|
| నళినీదళగత జలం | = | తామరాకుమీది నీటి బిందువు, |
| అతి తరళం | = | చలిస్తూనే ఉంటుంది, |
| తద్వత్ | = | అలాగే, |
| జీవితం | = | జీవితం, |
| అతిశయ చపలం | = | ఎంతో చంచలమైనది, |
| సమస్తం లోకం | = | లోకులందరూ, |
| వ్యాధి | = | రోగములతో బాధపడుతూ, |
| అభిమానగ్రస్తం | = | దేహాభిమానమును వదలకుండా, |
| శోకహతం చ | = | దుఃఖంచేత చంపబడుచున్నారని, |
| విద్ధి | = | తెలుసుకో! |

**తామరాకుమీది నీటి బిందువు చలిస్తూనే ఉంటుంది. అలాగే, జీవితం ఎంతో చంచలమైనది. లోకులందరూ రోగములతో బాధపడుతూ, దేహాభిమానమును వదలకుండా దుఃఖంచేత చంపబడుచున్నారని తెలుసుకో!**

## శ్రీ నాన్నగారు

తామరాకు మీద నీటి బొట్టు లాగా జీవితం చంచలమైంది అని శంకరులు అంటున్నారు. నిజమే కదా! మీరు అందరి జీవితాలలోనూ అనేక మార్పులు చూస్తూనే ఉన్నారు.

దేహాభిమానం అంటే దేహం నేను, నాది అనుకుని, దాని మీద అభిమానాన్ని వదలలేకపోవడం. ఆ దేహానికి ఎవో కొన్ని రోగాలు, ఆ రోగాలతో బాటు దుఃఖం, మరణం తప్పడం లేదు.

మరి ఏం చేయాలి అంటే, పరిస్థితులు, ఆరోగ్యం సహకరించినప్పుడు ఇంకా సమయం ఉందిలే అనుకోకుండా, వీలైనంత ఎక్కువ సత్సంగం చేయాలి. భగవాన్ (రమణ మహర్షి) చెప్పినట్టు నేనేవరిని అని విచారణ చేయాలి. భజగోవిందం చేయాలి.

✸ ✸ ✸

**యావద్విత్తోపార్జన సక్తః**
**తావన్నిజపరివారో రక్తః ।**
**పశ్చాజ్జీవతి జర్జర దేహే**
**వార్తాం కోఽపి న పృచ్ఛతి గేహే ॥** **॥భజ॥** **5**

యావద్విత్తోపార్జన = యావత్ + విత్తోపార్జన
తావన్నిజపరివారో = తావత్ + నిజపరివారః

యావత్ = ఎప్పటివరకు,
విత్తోపార్జన సక్తః = (నీకు) ధనాన్ని సంపాదించే శక్తి ఉంటుందో,
తావత్ = అంతవరకు,
నిజపరివారః = బంధుమిత్రులు,
రక్తః = (నీపై) ప్రేమను చూపిస్తారు,
పశ్చాత్ = తరువాత (ముసలితనంలో),
జర్జర దేహే = (నీ) దేహం శిథిలమై శక్తిహీనమై,
జీవతి = జీవిస్తున్నప్పుడు,
గేహే = (నీ) ఇంటిలో,
కోఽపి = ఒక్కరు కూడా,
వార్తాం = నీ విషయాలను,
న పృచ్ఛతి = అడుగరు.

**నీకు ధనాన్ని సంపాదించే శక్తి ఉన్నంతవరకు బంధుమిత్రులు నీపై ప్రేమను చూపిస్తారు. తరువాత ముసలితనంలో, నీ దేహం శిథిలమై శక్తిహీనమై జీవిస్తున్నప్పుడు నీ ఇంటిలో ఒక్కరు కూడా నిన్ను పలకరించరు.**

### శ్రీ నాన్నగారు

ఆచార్యులవారు చేదు నిజాలను చెబుతున్నారు. బయటివాళ్ళ సంగతి వదిలేయండి. మీరు డబ్బు సంపాదించ లేకపోతే బంధుమిత్రులు దూరమైపోవడం చూస్తూనే ఉన్నాం. ఇంకా, సంతానం ముసలి తల్లిదండ్రులను పలకరించకపోవడం కూడా జరుగుతూనే ఉంది.

ఈ డబ్బు, లౌకిక బంధాలు అంతకుముందులాగా, చివరికాలంలో మీకు తోడు ఉండవు. వాటి గొడవ పక్కన పెట్టి, ఆ గోవిందుడిని భజిస్తుంటే మీకు కావాల్సిన నిజమైన ఆనందాన్ని ఇస్తాడని శంకరులు చెబుతున్నారు.

✸ ✸ ✸

**యావత్పవనో నివసతి దేహే**
**తావత్ పృచ్ఛతి కుశలం గేహే ।**
**గతవతి వాయౌ దేహా పాయే**
**భార్యా భిభ్యతి తస్మిన్ కాయే ॥ ॥భజ॥ 6**

యావత్పవనో = యావత్ + పవనః

| | | |
|---|---|---|
| యావత్ | = | ఎప్పటివరకు, |
| దేహే | = | శరీరంలో, |
| పవనః | = | ఊపిరి ఉంటుందో, |
| తావత్ | = | అంతవరకు, |
| గేహే | = | ఇంటిలోనివారు, |
| కుశలం | = | కుశలమును, |
| పృచ్ఛతి | = | అడుగుతారు, |
| వాయౌ | = | (ఆ) ఊపిరి, |
| గతవతి | = | ఆగిపోయి, |
| దేహాపాయే | = | మరణం సంభవించినప్పుడు, |
| తస్మిన్ | = | ఆ, |
| కాయే | = | శరీరాన్ని (సమీపించడానికి), |
| భార్యా | = | అతని భార్య కూడా, |
| భిభ్యతి | = | భయపడుతుంది. |

**శరీరంలో ఊపిరి ఉన్నంతవరకు ఇంటిలోనివారు కుశలమును అడుగుతారు. ఆ ఊపిరి ఆగిపోయి, మరణం సంభవించినప్పుడు ఆ శరీరాన్ని సమీపించడానికి అతని భార్య కూడా భయపడుతుంది.**

## శ్రీ నాన్నగారు

శంకరులు ఇలాంటి చేదు నిజాలను ఎందుకు చెబుతున్నారంటే మీకు కావాల్సినంత వైరాగ్యం రావడానికి!

మామూలుగా ఉన్నప్పుడు ఇలాంటి వాటి గురించి ఎక్కువ ఆలోచించడానికి మీరు ఇష్టపడరని, సంసార సాగరంలోనే కొట్టుకుపోతుంటారని ఆచార్యులవారికి తెలుసు.

అజ్ఞానం అనే అంధకారంలో ఉన్న మిమ్మల్ని బయటకు తీసుకురావడానికి ఎప్పటికప్పుడు గురువు తన పని తాను చేస్తూ ఉంటాడు.

మీరు గురువు మీద విశ్వాసంతో ఆయన చెప్పిన మాటలను శ్రవణ మననాలు చేస్తూ ఉండాలి!

* * *

**బాలస్తావత్ క్రీడాసక్తః**
**తరుణస్తావత్ తరుణీసక్తః ।**
**వృద్ధస్తావత్ చింతాసక్తః**
**పరే బ్రాహ్మణి కోఽపి న సక్తః ॥ ॥భజ॥ 7**

బాలస్తావత్ = బాలః + తావత్
తరుణస్తావత్ = తరుణః + తావత్
వృద్ధస్తావత్ = వృద్ధః + తావత్

బాలః తావత్ = బాల్యంలో,
క్రీడాసక్తః = ఆటలపై ఆసక్తి కలిగి ఉంటారు,
తరుణః తావత్ = యవ్వనంలో,
తరుణీసక్తః = స్త్రీలపై ఆసక్తి కలిగి ఉంటారు,
వృద్ధః తావత్ = ముసలితనంలో,
చింతాసక్తః = విషయచింతనపై ఆసక్తి కలిగి ఉంటారు,
(కానీ),
పరే బ్రాహ్మణి = పరబ్రహ్మంమీద,
కోఽపి = ఎవరూ,
న సక్తః = ఆసక్తి కలిగి ఉండరు.

**బాల్యంలో ఆటలపై, యవ్వనంలో స్త్రీలపై, ముసలితనంలో విషయచింతనపై ఆసక్తి కలిగి ఉంటారు. కానీ, పరబ్రహ్మంమీద ఎవరూ ఆసక్తి కలిగి ఉండరు.**

బాల్యం ఆటలతో అయిపోతుంది.

యుక్తవయస్సు స్త్రీ – పురుష వ్యామోహంతో, ఆ తరువాత ఉద్యోగ వ్యాపారాలు, పెళ్ళి, పిల్లలు, ఇంటి పనులతో అయిపోతుంది.

ఇక ముసలితనం అనారోగ్యం సమస్యలు, వాళ్ళు వీళ్ళు నన్ను పట్టించుకోవడం లేదనే ఆలోచనలతో అయిపోతుంది.

**శ్రీనాన్నగారు**

పుట్టింది మొదలు చచ్చేటంతవరకు లౌకిక వ్యవహారాలతోనే మనుష్యుల జీవితాలు ఎలా గడిచిపోతున్నాయి అనేది ఆచార్యులవారు చెబుతున్నారు.

ఇంతా చేస్తే, ఆ పనులలో మీకు కలిగే సుఖాలు క్షణికమే! అంతే కాదు, ఆ కొంచెం సుఖాలతో పాటు చాలా దుఃఖాలు కూడా అనుభవంలోకి వస్తున్నాయి.

అలా మీ జీవితం కూడా గడిచిపోకుండా, వచ్చిన పని సంగతి అంటే సద్వస్తువు మీద ఆసక్తి చూపించి బ్రహ్మానందాన్ని పొందండి అని హితోపదేశం!

✸✸✸

**కా తే కాంతా కస్తే పుత్రః**
**సంసారోఽ యమతీవ విచిత్రః ।**
**కస్య త్వం వా కుత ఆయాతః**
**తత్త్వం చింతయ తదిహ భ్రాతః ॥** **॥భజ॥** **8**

| | | |
|---|---|---|
| కస్తే | = | కః + తే |
| సంసారోఽ యమతీవ | = | సంసారః + అయం + అతీవ |
| తదిహ | = | తత్ + ఇహ |

| | | |
|---|---|---|
| భ్రాతః | = | ఓ సోదరుడా! |
| తే | = | నీకు, |
| కాంతా | = | భార్య, |
| కా | = | ఎవరు? |
| పుత్రః | = | కుమారుడు, |
| కః | = | ఎవడు? |
| త్వం | = | నీవు, |
| కస్య | = | ఎవరివాడవు? |
| (త్వం కః? | = | నువ్వెవరు?) |
| కుత | = | ఎక్కడనుండి, |
| ఆయాతః | = | వచ్చావు? |
| అయం | = | ఈ, |
| సంసారః | = | సంసారం, |
| అతీవ | = | అతి, |
| విచిత్రః | = | విచిత్రమైనది, |

| | | |
|---|---|---|
| తత్ | = | అందువలన, |
| ఇహ | = | దీనియందు, |
| తత్త్వం | = | తత్త్వమును, |
| చింతయ | = | విచారించు! |

**ఓ సోదరుడా! నీకు భార్య ఎవరు? కూమారుడు ఎవడు? నీవు ఎవరివాడవు? నువ్వెవరు? ఎక్కడినుండి వచ్చావు? ఈ సంసారం అతి విచిత్రమైనది. అందువలన దీనియందు తత్త్వమును విచారించు!**

## శ్రీ నాన్నగారు

మీ మంచికోసం మూఢుడా అన్న ఆచార్యులవారే ఇప్పుడు ప్రేమగా సోదరుడా అంటున్నారు. ప్రేమ లేకపోతే తిట్టలేరు కదా!

తత్త్వమును అంటే నిజమేమిటో విచారించి తెలుసుకో అంటున్నారు. అలా తెలుసుకోకపోతే మీరు ఈ విచిత్రమైన సంసార సాగరంలో కొట్టుకుపోతూనే ఉంటారు!

విచారణ చేయి అని ఊరుకోకుండా, ఆ విచారణకు అవసరమైన ప్రశ్నలను కూడా మీకు చెప్పారు, ఆయన ఆచార్యులవారు కదా!

✸ ✸ ✸

**సత్సంగత్వే నిస్సంగత్వం**
**నిస్సంగత్వే నిర్మోహత్వమ్ ।**
**నిర్మోహత్వే నిశ్చలతత్త్వం**
**నిశ్చలతత్త్వే జీవన్ముక్తిః ॥ ॥భజ॥ 9**

సత్సంగత్వే = సత్సంగంవలన,
నిస్సంగత్వం = ప్రాపంచిక విషయాలమీద గల ఆసక్తి పోతుంది,
నిస్సంగత్వే = నిస్సంగత్వంవలన,
నిర్మోహత్వమ్ = మోహం నశిస్తుంది,
నిర్మోహత్వే = మోహం నశించడంవలన,
నిశ్చలత్త్వం = నిశ్చలతత్త్వం కలుగుతుంది,
నిశ్చలతత్త్వే = ఆ నిశ్చలతత్త్వంతో,
జీవన్ముక్తిః = జీవన్ముక్తి లభిస్తుంది.

**సత్సంగంవలన నిస్సంగత్వం అంటే ప్రాపంచిక విషయాలమీద గల ఆసక్తి పోతుంది. నిస్సంగత్వంవలన నిర్మోహత్వం అంటే మోహం నశిస్తుంది. మోహం నశించడంవలన నిశ్చలతత్త్వం కలుగుతుంది. ఆ నిశ్చలతత్త్వంతో జీవన్ముక్తి లభిస్తుంది.**

సత్సంగం = సత్ + సంగం.

సత్ అంటే సత్యం. సంగం అంటే కలయిక. సత్‌ను తెలుసుకొన్న సత్పురుషులతో సహవాసాన్ని సత్సంగం అంటారు.

సత్‌కు సంబంధించిన శ్రవణం, మననం, నిదిధ్యాసనం కూడా సత్సంగం అని వ్యవహారం.

సత్సంగం గురించి శంకరులు వివేకచూడామణిలో ఇలా చెప్పారు:

*దుర్లభం త్రయమేవైతత్ దైవానుగ్రహహేతుకమ్ ।*
*మనుష్యత్వం ముముక్షుత్వం మహాపురుషసంశ్రయః ॥*

మానవజన్మ, మోక్షం కోసం తీవ్రమైన కోరిక కలగడం, మహాపురుషుల సహవాసం అనే మూడు అతి కష్టంమీద లభిస్తాయి, అవి దైవానుగ్రహం వలననే కలుగుతాయి.

## శ్రీ నాన్నగారు

ఈ శ్లోకంలో సత్సంగం మోక్షానికి ఎలా దారి తీస్తుందనే దాని గురించి ఆచార్యులవారు చాలా చక్కగా చెప్పారు.

సత్సంగంలో సద్వస్తువు గురించి వింటూ, ఆలోచిస్తుంటే మీరు ప్రాపంచిక విషయాలకు దూరమవుతారు. అదే నిస్సంగత్వం.

అలా నిస్సంగత్వంలో అంతర్ముఖులై మీరు సత్యాన్ని తెలుసుకోగానే, మోహం అనే అజ్ఞానం పోతుంది. అది నిర్మోహత్వం.

మోహం లేనప్పుడు రాగద్వేషాలు ఉండవు. అశాంతి, దుఃఖం ఉండవు. ఆలోచనల అలజడులు ఉండవు. ప్రశాంతంగా ఉంటారు. అదే నిశ్చలతత్వం.

ఆ ప్రశాంతతలో నూటికి నూరు శాతం నిర్మలమై మీరు బ్రహ్మానందాన్ని అనుభవిస్తూ జీవన్ముక్తులు అవుతారు.

✹ ✹ ✹

**వయసి గతే కః కామవికారః**
**శుష్కే నీరే కః కాసారః ।**
**క్షీణే విత్తే కః పరివారో**
**జ్ఞాతే తత్త్వే కః సంసారః ॥ ॥భజ॥ 10**

| | | |
|---|---|---|
| వయసి | = | వయస్సు, |
| గతే | = | మళ్ళినవానికి, |
| కామవికారః | = | కామ వికారం, |
| కః | = | ఎక్కడిది? |
| నీరే | = | నీరు, |
| శుష్కే | = | ఎండిపోతే, |
| కాసారః | = | చెరువు, |
| కః | = | ఎక్కడిది? |
| విత్తే | = | ధనం, |
| క్షీణే | = | లేకపోతే, |
| పరివారః కః | = | పరివారం ఎక్కడుంటుంది?, |
| తత్త్వే | = | తత్త్వం, |
| జ్ఞాతే | = | తెలిసిన తరువాత, |
| సంసారః కః | = | సంసారం ఎక్కడిది? |

**వయస్సు మళ్ళినవానికి కామ వికారం ఎక్కడిది? నీరు ఎండిపోతే చెరువు ఎక్కడిది? ధనం లేకపోతే పరివారం ఎక్కడుంటుంది? తత్త్వం తెలిసిన తరువాత సంసారం ఎక్కడిది?**

## శ్రీ నాన్నగారు

అసలు విషయం బాగా అర్థం చేసుకోవడానికి ఆచార్యులవారు ముందుగా కొన్ని ఉపమానాలు చెబుతున్నారు.

వయస్సు పెరిగి, శరీరం సహకరించనప్పుడు, కామవికారం తగ్గడం మామూలే. నీరు లేని దానిని చెరువు అని అనం. అలాగే, మీ దగ్గర డబ్బు లేకపోతే పనివాళ్ళు ఉండరు కదా!

మీకు తత్త్వం తెలిసాక అంటే సద్వస్తువు అనుభవంలోకి వచ్చాక, మీలో అజ్ఞానానికి చోటు లేనప్పుడు ఈ సంసారం ఉండదు.

ఈ సంసార బాధలనుండి బయటపడి బ్రహ్మానందాన్ని పొందాలంటే, మీరు సత్యాన్ని తెలుసుకోవాల్సిందే.

మీ లక్ష్యం చేరుకొనేవరకు, గురువు మీ లోపలనుండి, బయటనుండి ఎప్పటికప్పుడు మీకు మార్గనిర్దేశం చేస్తూనే ఉంటాడు.

✷ ✷ ✷

**మా కురు ధన జన యౌవ్వన గర్వం**
**హరతి నిమేషాత్ కాలః సర్వమ్ ।**
**మాయామయమిదమఖిలం హిత్వా**
**బ్రహ్మపదం త్వం ప్రవిశ విదిత్వా ॥ ॥భజ॥ 11**

మాయామయమిదమఖిలం = మాయామయం + ఇదం + అఖిలం

| | | |
|---|---|---|
| ధన జన యౌవ్వన | = | ధనం, పరివారం, యవ్వనం (ఉన్నాయని) |
| గర్వం | = | గర్వమును, |
| మా కురు | = | పొందవద్దు, |
| సర్వం | = | వీటన్నింటిని, |
| కాలః | = | కాలం, |
| నిమేషాత్ | = | క్షణంలో, |
| హరతి | = | నాశనం చేసేస్తుంది, |
| త్వం | = | నీవు, |
| ఇదం అఖిలం | = | ఇవన్నీ, |
| మాయామయం | = | మాయామయం అని, |
| హిత్వా | = | గ్రహించి, |
| బ్రహ్మపదం | = | బ్రహ్మమును, |
| విదిత్వా | = | తెలుసుకొని, |
| ప్రవిశ | = | ఆ బ్రహ్మము అయిపో! |

**ధనం, పరివారం, యవ్వనం ఉన్నాయని గర్వమును పొందవద్దు. వీటన్నింటిని కాలం క్షణంలో నాశనం చేసేస్తుంది. నీవు ఇవన్నీ మాయామయం అని గ్రహించి, బ్రహ్మమును తెలుసుకొని ఆ బ్రహ్మము అయిపో!**

**శ్రీ నాన్నగారు**

మీకు, మీ గమ్యానికి మధ్య అడ్డుగోడలుగా ఉన్నవాటి గురించి ఒక క్రమపద్ధతిలో, హేతుబద్ధంగా ఆచార్యులవారు చెబుతున్నారు.

మీకు గర్వం ఉన్నంతవరకు నిజాన్ని తెలుసుకోలేరు. ఆ గర్వం అనేది సాధారణంగా డబ్బు, పనివాళ్ళు, యవ్వనం, అందం మొదలైన వాటి వల్ల వస్తూ ఉంటుంది. వీటన్నింటినీ కాలం ఒక్క క్షణంలో నాశనం చేయడం మీకు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో అనుభవంలో ఉన్నదేగా! ఒక ప్రమాదం ఎంతో మంది జీవితాలను దారుణంగా ప్రభావితం చేయడం వింటూనే ఉన్నారు కదా!

అందువల్ల, మాయామైన అంటే నిజంకాని, అశాశ్వతమైన వాటి భ్రమలో కాలాన్ని వృధా చేయకుండా వచ్చిన పనిమీద దృష్టి పెట్టి అంటే సత్యాన్వేషణ చేసి బ్రహ్మమును తెలుసుకొండి.

బ్రహ్మము విషయంలో తెలుసుకోవడం, అనుభవించడం వేరు కాదు. అందువలన మీరు బ్రహ్మమును తెలుసుకొంటే, మీరే బ్రహ్మము అయిపోతారు!

✷ ✷ ✷

**దినయామిన్యౌ సాయం ప్రాతః**
**శిశిర వసంతౌ పునరాయాతః ।**
**కాలః క్రీడతి గచ్ఛత్యాయుః**
**తదపి న ముంచత్యాశావాయుః ॥ ॥భజ॥ 12**

పునరాయాతః = పునః + ఆయాతః
గచ్ఛత్యాయుః = గచ్ఛతి + ఆయుః
ముంచత్యాశావాయుః = ముంచతి + ఆశావాయుః

దినయామిన్యౌ = రాత్రింబగళ్ళు,
సాయం ప్రాతః = సాయంకాలం, ప్రాతకాలం (ఉదయం),
శిశిర వసంతౌ = శిశిర, వసంత ఋతువులు,
పునః = మళ్ళీ మళ్ళీ,
ఆయాతః = వస్తున్నాయి,
(ఏవం = ఈ విధముగా),
కాలః = కాలం,
క్రీడతి = ఆడుకొంటున్నది,
ఆయుః = (నీ) ఆయువు,
గచ్ఛతి = క్షీణించుచున్నది,
తదపి = అయినా,
ఆశావాయుః = ఆశ అనునట్టి గాలి మాత్రం,
న ముంచతి = (నిన్ను) వదలటం లేదు.

**రాత్రింబగళ్ళు, సాయంకాలం, ఉదయం, శిశిర, వసంత ఋతువులు మళ్ళీ మళ్ళీ వస్తున్నాయి. ఈ విధముగా కాలం ఆడుకొంటున్నది. నీ ఆయువు క్షీణించుచున్నది. అయినా, ఆశ అనునట్టి గాలి మాత్రం నిన్ను వదలటం లేదు.**

కోరిక కలిగితే అది తీరాలి అనే ఆశ అవుతుంది.

ఆ కోరిక తీరకపోతే మనస్సులో అది ఆశగా ఉండిపోతుంది.

ఆ కోరిక తీరితే మనస్సులో అది సంస్కారంగా ఉండిపోతుంది. ఆ సంస్కారం వాసనగా మారుతుంది. ఆ వాసనలో నుండి మళ్ళీ కోరిక కలిగి అది తీరేటంతవరకు ఆశగా ఉంటుంది. ఇదంతా ఒక విషవలయం.

శంకరులు ఈ శ్లోకంలో ఆశను వాయువుతో పోల్చారు. వాయువు అంటే గాలి అని అర్థం. గాలి అంటే "దయ్యం" అని వ్యవహారంలో వాడతాం. ఆశ అనేది దయ్యం పట్టినట్టు పట్టుకొని వివేకాన్ని చంపేసి, మనలను బాధపెడుతుంది అని భావం.

ఆశ ఎంతో ప్రమాదకరం అని శంకరులు వివేకచూడామణిలో ఇలా చెప్పారు:

అస్థిరమైన వైరాగ్యంతో సంసార సాగరాన్ని దాటాలని ప్రయత్నం చేసే ముముక్షువును "ఆశ" అనే మొసలి దారిలోనే కంఠమునందు పట్టుకొని వేగంగా నడి సముద్రంలో ముంచుతుంది.

(వివేకచూడామణి - 81)

శ్రీవసిష్ఠ మహర్షులవారు శ్రీరాముడితో ఇలా అన్నారు:

"జడమగు ఈ దేహం కొరకై ఏర్పడి ఉన్న భోగాలతో నాకేమి పని?" - అనే నిశ్చయంతో దృశ్యంనందు నీకు ఏర్పడే ఆశ అను దానిని నశింపజేయాలి. అప్పుడు ఆశ యొక్క పరివారమైన దేహాభిమానం, కామక్రోధాదులు తొలగుతాయి.

(యోగవాసిష్ఠము)

పరమాత్మను భజించడానికి సమయం దొరకడం లేదు అనిపించినప్పుడు ఈ క్రింది నీతి సూత్రాన్ని గుర్తుకు తెచ్చుకోవాలి:

**శతం విహాయ భోక్తవ్యం సహస్రం స్నానమాచరేత్ ।**
**లక్షం విహాయ దాతవ్యం కోటి త్యక్త్వా హరింభజేత్ ॥**

వంద పనులను వదిలిపెట్టయినా సమయానికి భోజనం చేయాలి. వెయ్యి పనులను మానుకునైనా స్నానం చేయాలి. లక్ష పనులను వదిలిపెట్టయినా దానాలను చేయాలి. కోటిపనులను మానుకునైనా హరిని భజించాలి.

## శ్రీ నాన్నగారు

ఈ శ్లోకంలో శంకరులు కాలం ఎంత విలువైనదో అందంగా చెప్పారు.

కాలగమనం ఎవరి కోసమూ ఆగకుండా జరుగుతూనే ఉంటుంది. ఆ గమనంతో పాటు, అనిత్యమైన జీవుల ఆయుర్దాయం తగ్గిపోతూ ఉంటుంది.

కాలం ఆడే ఆటలో అజ్ఞానంతో ఆశల విషవలయంలో పడి మీరు ఓడిపోకుండా, సత్సంగం ద్వారా సద్వస్తువును అనుభవంలోకి తెచ్చుకోవడానికి మీ సమయాన్ని వినియోగించమని ఆచార్యులవారి ఉపదేశం!

✸✸✸

**కా తే కాంతా ధనగత చింతా?**
**వాతుల కిం తవ నాస్తి నియంతా ।**
**త్రిజగతి సజ్జన సంగతిః ఏకా**
**భవతి భవార్ణవ తరణే నౌకా ॥** **॥భజ॥** **13**

| | | |
|---|---|---|
| వాతుల | = | వెర్రివాడా! |
| తే | = | నీ, |
| కాంతా | = | భార్య, |
| కా | = | ఎవరు? |
| ధనగత చింతా | = | ధనమును గురించి చింతతో ఉన్న, |
| తవ | = | నిన్ను, |
| నియంతా | = | నియంత్రించువాడు, |
| నాస్తి కిం | = | లేదనుకున్నావా? |
| భవార్ణవ తరణే | = | సంసార మహాసముద్రాన్ని దాటడానికి, |
| త్రిజగతి | = | ముల్లోకాలలో, |
| సజ్జన సంగతిః | = | సజ్జన సాంగత్యం (అను), |
| నౌకా | = | నౌక, |
| ఏకా | = | ఒక్కటే, |
| భవతి | = | ఉంది. |

**వెర్రివాడా! నీ భార్య ఎవరు? ధనమును గురించి చింతతో ఉన్న నిన్ను నియంత్రించువాడు లేదనుకున్నావా? సంసార మహాసముద్రాన్ని దాటడానికి ముల్లోకాలలో సజ్జన సాంగత్యం అను నౌక ఒక్కటే ఉంది.**

ఈ శ్లోకాన్ని పద్మపాదులవారు చెప్పారు. ఒకరోజు ఆయన గంగకు అవతల ఒడ్డున ఉన్నప్పుడు గురువుగారైన శంకరులు రమ్మని సైగచేశారట. దానితో ఆయన వేరే ఆలోచన లేకుండా గంగ వైపు నడవడం మొదలుపెట్టారట. వారి అచంచలమైన గురుభక్తికి మెచ్చిన గంగ ఆయన మునిగిపోకుండా అడుగు అడుగుకు ఒక పద్మాన్ని నీటిపైకి తెచ్చి ఆయన పాదాలు ఆ పద్మంలో పెట్టేలా చేసి ఆయన మునగకుండా తనను (గంగను) దాటేలా చేసిందట. అందువల్ల ఆయనకు పద్మపాదులు అనే పేరు వచ్చింది.

## శ్రీ నాన్నగారు

కేవలం లౌకిక వ్యవహారాలలో జీవిస్తున్నవారికి నియంత్రణ అంటే అదుపు చేసేవాడు లేడనుకోవద్దు అంటున్నారు. చాలామంది కేవలం భార్యాబిడ్డలు, ధన సంపాదన పనుల్లోనే ఉండిపోవడం చూస్తూనే ఉన్నాం.

"కర్తురాజ్ఞయా ప్రాప్యతే ఫలం" అని భగవాన్ (రమణ మహర్షి) చెప్పినట్టు ఆ కర్త అంటే భగవంతుడి ఆజ్ఞానుసారం వారి కర్మలకు తగిన ఫలితాలు వారికి వస్తాయి. ఆ కర్మలు వారికి శాంతిని, ఆనందాన్ని ఇవ్వవని తగిన సమయం వచ్చినప్పుడు వారికే అర్థం అవుతుంది. ఆ విధంగా నియంత్రణ జరుగుతుంది కదా!

మీరు గృహస్థుగా ఉన్నప్పుడు కుటుంబ బాధ్యతలు కొన్ని ఉంటాయి. వాటికి సంబంధించిన పనులు చేయండి. కానీ, అంతటితోనే ఆగిపోకుండా, వీలైనంత సత్సంగం చేయండి. సద్వస్తువును తెలుసుకొనేటంతవరకు మీరు నమ్ముకున్న గురువు మిమ్మల్ని వదలడు.

✸ ✸ ✸

**జటిలో ముండీ లుంచిత కేశః**
**కాషాయాంబర బహుకృత వేషః ।**
**పశ్యన్నపి చ న పశ్యతి మూఢః**
**ఉదర నిమిత్తం బహుకృత వేషః ॥** **॥భజ॥** **14**

జటిలో = జుట్టును జడలుగా కట్టించుకొనడం,
ముండీ = తల నున్నగా గొరిగించుకొనడం,
లుంచిత కేశః = జుట్టును అనేక విధాలుగా కత్తిరించుకొనడం,
కాషాయాంబర = కాషాయవస్త్రాలు వేసుకోవడం,
(ఇలా),
ఉదర నిమిత్తం = పొట్ట నింపుకోవడానికి,
బహుకృత వేషః = అనేక వేషాలు వేస్తున్నారు,
(బ్రహ్మమయమైన ఈ ప్రపంచమును),
పశ్యన్నపి చ = చూస్తున్నా కూడా,
మూఢః = మూఢుడు,
న పశ్యతి = (బ్రహ్మమును) చూడడం లేదు.

**జుట్టును జడలుగా కట్టించుకొనడం, తల నున్నగా గొరిగించుకొనడం, జుట్టును అనేక విధాలుగా కత్తిరించుకొనడం, కాషాయవస్త్రాలు వేసుకోవడం, ఇలా పొట్ట నింపుకోవడానికి అనేక వేషాలు వేస్తున్నారు. బ్రహ్మమయమైన ఈ ప్రపంచమును చూస్తున్నా కూడా, మూఢుడు బ్రహ్మమును చూడడం లేదు.**

ఈ శ్లోకాన్ని తోటకాచార్యులవారు చెప్పారు.

కాంతా కనకాలకు దూరంగా ఉండాల్సినప్పటికీ, కపట సన్యాసులు కొంతమంది వాటికోసమే అనేక మోసాలు చేస్తున్నారని, వారికి దూరంగా ఉండమని హెచ్చరిస్తున్నారు.

"తలలు బోడులైన తలపులు బోడులా?" అని వేమన చమత్కరించాడు. జుట్టు గొరిగించుకున్నంత మాత్రాన సరిపోదు, ఆశత్యాగం అంటే మనస్సులో విషయవాంఛలకు సంబంధించిన ఆలోచనలు లేకుండా ఉండడం ముఖ్యం అని భావం.

**శ్రీ నాన్నగారు**

ఈ శ్లోకంలో తోటకాచార్యులవారు కూడా ప్రేమతో మూఢా అని తిడుతున్నారు.

లోక కళ్యాణం కోసం పనికి వచ్చే మాట చెప్పి మరీ తిట్టారు. అదేమిటంటే చూస్తున్నా చూడడం లేదు మూఢుడు అన్నారు.

వాస్తవానికి చూస్తోంది అంతా బ్రహ్మమయమే! కాని అజ్ఞానంలో ఉన్నవాడికి అలా కనిపించదు కదా!

దొంగ సన్యాసులవద్దకు వెళ్ళి మోసపోకుండా సద్గురువును ఆశ్రయించి సత్యాన్ని దర్శించండి అని చెబుతున్నారు.

✸✸✸

**అంగం గళితం పలితం ముండం**
**దశన విహీనం జాతం తుండమ్ ।**
**వృద్ధోయాతి గృహీత్వా దండం**
**తదపి న ముంచత్యాశా పిండమ్ ॥ ॥భజ॥ 15**

ముంచత్యాశా = ముంచతి + ఆశా

అంగం = శరీరం,
గళితం = సడలి ముడతలు పడింది,
ముండం = తల,
పలితం = పూర్తిగా తెల్లబడిపోయింది,
దశన విహీనం = పండ్లు ఊడిపోయి,
తుండం = నోరు,
జాతం = బోసి అయింది,
వృద్ధోయాతి = ముసలితనం వచ్చి,
దండం = క్రరను,
గృహీత్వా = పట్టుకుని గాని,
(కదలలేదు),
తదపి = అయినా కూడా,
(అతడు),
ఆశాపిండం = ఆశలమూటను,
న ముంచతి = వదలలేకపోతున్నాడు.

**శరీరం సడలి ముడతలు పడింది. తల పూర్తిగా తెల్లబడిపోయింది. పండ్లు ఊడిపోయి నోరు బోసి అయింది. ముసలితనం వచ్చి క్రరను పట్టుకుని గాని కదలలేదు. అయినా కూడా, అతడు ఆశలమూటను వదలలేకపోతున్నాడు.**

ఈ శ్లోకాన్ని హస్తామలకులవారు చెప్పారు. హస్త అమలకం అంటే అరచేతిలో ఉసిరికాయ ఎంత స్పష్టంగా కనిపిస్తుందో, అంత స్పష్టంగా పన్నెండు శ్లోకాలలో ఆత్మతత్త్వమును చెప్పారని శంకరులవారే ఆయనకు ఆ నామకరణం చేశారు. అంతే కాదు, తన శిష్యుడైన హస్తామలకులవారు చెప్పిన శ్లోకాలకు గురువైన శంకరులు భాష్యం వ్రాసారు.

**శ్రీ నాన్నగారు**

వృద్ధాప్యంలో మీలో జవసత్వాలు అన్నీ ఉడిగిపోయినా, మీ కూడా ఆశల మూట వస్తూనే ఉంటుంది అంటున్నారు.

ఆశలున్నంతవరకు మీ సమయం చాలావరకు కామ క్రోధాదులు, రాగద్వేషాలతోనే గడిచిపోతుంది, అసలు విషయం అంటే సత్యాన్వేషణ మీద దృష్టి పెట్టలేరు.

సన్నిహితులెవరన్నా చనిపోయినప్పుడు గాని, ఏవైనా ఇబ్బందులు వచ్చినప్పుడు గాని, ముసలితనంలో గాని కలిగే పైపై వైరాగ్యం తాత్కాలికం, అది నిలబడదు. బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య అను వివేకంతో కూడిన వైరాగ్యం కలిగితే అది నిలబడుతుంది.

ఈ అనిత్యమైన విషయాలలో కలిగే సుఖం ఏదైనా ఉంటే అది క్షణికం. ఆ సుఖం తనతో పాటు దుఃఖాన్ని కూడా తీసుకువస్తుంది. లౌకిక విషయాలవల్ల నిజమైన ఆనందం కలగదు అని మీరు దృఢంగా నిశ్చయించుకొని పదే పదే మీ మనస్సుకి చెప్పుకోవాలి. అప్పుడు ఆశలను వదిలివేయ గలుగుతారు.

✸✸✸

**అగ్రే వహ్నిః పృష్ఠే భానుః**
**రాత్రౌ చుబుక సమర్పిత జానుః ।**
**కరతల భిక్షస్తరుతల వాసః**
**తదపి న ముంచత్యాశాపాశః ॥** ॥భజ॥ **16**

భిక్షస్తరుతల = భిక్షః + తరుతల
ముంచత్యాశాపాశః = ముంచతి + ఆశాపాశః

అగ్రే = ముందు,
వహ్నిః = చలిమంట,
పృష్ఠే = వెనుక,
భానుః = సూర్యుని వేడి,
రాత్రౌ = రాత్రులందు,
చుబుక = గడ్డమునకు,
సమర్పిత = సమర్పింపబడిన,
జానుః = మోకాళ్ళు,
కరతల = చేతిలో పడవేసిన,
భిక్షః = భిక్షను మాత్రమే తింటూ,
తరుతల = చెట్ల నీడలలో,
వాసః = నివసిస్తాడు,
తదపి = అయినా,
ఆశాపిండం = ఆశాపాశమును,
(అతడు),
న ముంచతి = వదలలేకపోతున్నాడు.

**చలినుండి తప్పించుకోవడానికి ముందు చలిమంట పెట్టుకుంటాడు. ఎండ తగలడానికి వీపును సూర్యునివైపు ఉంచుతాడు. రాత్రులందు మోకాళ్ళపై గడ్డమును ఉంచుతాడు. చేతిలో పడవేసిన భిక్షను మాత్రమే తింటూ చెట్ల నీడలలో నివసిస్తాడు. అయినా, ఆశాపాశమును అతడు వదలలేకపోతున్నాడు.**

ఈ శ్లోకాన్ని శంకరుల శిష్యుడైన సుభోధ చెప్పారు.

ఇంతకుముందు పదిహేనవ శ్లోకంలో గృహస్థుడైన వృద్ధుడి విషయంలో ఆశ గురించి చెప్పాక, ఈ శ్లోకంలో సన్యాసి విషయంలో ఆశ గురించి చెబుతున్నారు.

శ్రీవసిష్ఠ మహర్షులవారు శ్రీరాముడితో ఇలా అన్నారు:

నీ నైరాశ్యము (ఆశారాహిత్యం)చే ఈ జగత్తునంతటినీ ప్రశాంతమయం, శీతలం చేసివేయి. 'ఆశించుట' అను దురభ్యాసం (చెడు అలవాటు) నుండి విడివడిన మనస్సు కలిగినవాడవై, మౌనివై, జ్ఞానివై శోభించు.

ఆశయే లేని మనస్సు ఇచ్చే సుఖం త్రిలోకాధిపత్యంలో కూడా ఉండదు.

(యోగవాసిష్ఠము)

## శ్రీ నాన్నగారు

ఆశలను వదలకపోతే, అవి సన్యాసినైనా బంధించి సంసార సాగరాన్ని దాటనివ్వవు అని చెబుతున్నారు!

ఆశలన్నింటినీ పూర్తిగా వదిలేసి సత్యాన్వేషణ చేస్తే మీరు తప్పక సఫలీకృతులవుతారు.

✷ ✷ ✷

**కురుతే గంగాసాగర గమనం**
**వ్రత పరిపాలనమథవా దానమ్ ।**
**జ్ఞానవిహీనః సర్వమతేన**
**ముక్తిం న భజతి జన్మశతేన ॥ ॥భజ॥ 17**

పరిపాలనమథవా = పరిపాలనం + అథవా

| | | |
|---|---|---|
| గంగాసాగర గమనం | = | గంగా సాగర సంగమంలో స్నానాలు, |
| వ్రతపరిపాలనం | = | ఎన్నో వ్రతాలు, |
| అథవా | = | లేక, |
| దానం | = | దానాలు, |
| కురుతే | = | చేసినా, |
| జ్ఞానవిహీనః | = | ఆత్మజ్ఞానమును పొందకుండా, |
| సర్వమతేన | = | అన్ని మతాలలోనూ, |
| జన్మశతేన | = | వంద జన్మలకైనా, |
| ముక్తిం | = | ముక్తిని, |
| న భజతి | = | పొందడం జరగదు. |

**గంగా సాగర సంగమంలో స్నానాలు, ఎన్నో వ్రతాలు, దానాలు చేసినా, ఆత్మజ్ఞానమును పొందకుండా అన్ని మతాలలోనూ వంద జన్మలకైనా ముక్తిని పొందడం జరగదు.**

ఈ శ్లోకాన్ని సురేశ్వరాచార్యులవారు చెప్పారు. శంకరులు రచించిన శ్రీదక్షిణామూర్తి స్తోత్రమునకు సురేశ్వరాచార్యులవారు "మానసోల్లాసము" అను పేరుతో ప్రఖ్యాతి చెందిన వార్తికమును రచించారు.

**శ్రీ నాన్నగారు**

కాశీలో గంగాస్నానాలు చేయడం, వ్రతాలు చేయడం, దానాలు చేయడం మంచివే, వాటివల్ల చిత్తశుద్ధి కలుగుతుంది, పుణ్యం వస్తుంది. అంతవరకే గాని, అవి మోక్షానికి సరిపోవు అని అంటున్నారు.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు:

**శ్రద్ధావాన్ లభతే జ్ఞానం తత్పరః సంయతేన్ద్రియః ।**
**జ్ఞానం లబ్ధ్వా పరాం శాన్తిమచిరేణాధిగచ్ఛతి ॥** (భగవద్గీత 4-39)

శ్రద్ధగలవాడు, విషయాలనుండి ఇంద్రియాలను మరల్చి, తదేకనిష్ఠతో ఉన్నవాడు జ్ఞానమును పొందుతాడు. ఆ జ్ఞానమును పొందినవాడు వెంటనే పరమశాంతిని పొందుతాడు.

ఇక్కడ శ్రద్ధ అంటే అచంచలమైన విశ్వాసం. ఆ శ్రద్ధ అనేది గురువు చెప్పేదానిమీద, శాస్త్రం చెప్పేదానిమీద ఉండాలి. ఇంకా, మీ మనస్సు, ఇంద్రియాలు లౌకిక విషయాలపైన కాకుండా సద్వస్తువు మీదే ఉండాలి. అప్పుడు మీకు జ్ఞానం లభిస్తుంది.

పరమశాంతి అంటే మోక్షం కోసం జ్ఞానం పొందడానికి మీరు కృషి చేయాలి.

✷ ✷ ✷

**సురమందిర తరుమూల నివాసః**
**శయ్యా భూతలమజినం వాసః ।**
**సర్వ పరిగ్రహ భోగ త్యాగః**
**కస్య సుఖం న కరోతి విరాగః ॥** **॥భజ॥** **18**

భూతలమజినం = భూతలం + అజినం

సురమందిర = దేవాలయంలో కాని,
తరుమూల = చెట్టు క్రింద కాని,
నివాసః = నివసిస్తూ,
భూతలం = నేలమీదనే,
శయ్యా = పడుకుంటూ,
అజినం = చర్మమునే,
వాసః = వస్త్రంగా ధరిస్తూ,
సర్వ = అన్ని విషయాలను,
పరిగ్రహ = స్వీకరించడం,
భోగ = అనుభవించడం,
త్యాగః = (అనునవి) లేని,
విరాగః = విరాగైన,
కస్య = వానికి,
సుఖం = సుఖం,
న కరోతి = ఎందుకు ఉండదు?

**దేవాలయంలో కాని, చెట్టు క్రింద కాని నివసిస్తూ, నేలమీదనే పడుకుంటూ, చర్మమునే వస్త్రంగా ధరిస్తూ, అన్ని విషయాలను స్వీకరించడం, అనుభవించడం అనునవి లేని విరాగైనవానికి సుఖం ఎందుకు ఉండదు?**

ఈ శ్లోకాన్ని నిత్యానందుడు చెప్పారు.

**శ్రీ నాన్నగారు**

విరాగి అయిన సన్యాసికి సుఖం ఎందుకు ఉండదు అని ప్రశ్న.

ఆ ప్రశ్నలోనే సమాధానం ఉంది, వానికి సుఖం లేకుండా ఉండడానికి వీలు లేదు అని.

ఈ ప్రాపంచిక విషయాలమీద ఆసక్తి ఉంటే మీకు సుఖం ఉండదు అని పరోక్షంగా చెబుతున్నారు.

మీరు కూడా భోగాలమీద ఆశలను వదిలేసి విరాగి అయిపోతే నాకు లాగా నిత్యానందులు అవుతారు అని చెబుతున్నారు.

భోగాలలో నిజమైన సుఖంలేదని, చివరకు దుఃఖమే మిగులుతుందని మీకు వివేకంతో తెలుస్తుంటుంది.

అలా తెలియడంతో పాటు, సత్సంగంలో శాంతి, ఆనందం అనుభవంలోకి వస్తుంటే భోగాలపై మీకు సహజంగానే విరక్తి వస్తుంది.

✷✷✷

**యోగరతో వా భోగరతో వా**
**సంగరతో వా సంగవిహీనః ।**
**యస్య బ్రహ్మణి రమతే చిత్తం**
**నందతి నందతి నందత్యేవ ॥** **॥భజ॥** **19**

నందత్యేవ = నందతి + ఏవ

| | |
|---|---|
| యోగరతో వా | = యోగి అయినా, |
| భోగరతో వా | = భోగి అయినా, |
| సంగరతో వా | = నలుగురిలో ఉన్నా, |
| సంగవిహీనః | = ఒంటరిగా ఉన్నా, |
| యస్య | = ఎవని, |
| చిత్తం | = చిత్తము, |
| బ్రహ్మణి | = బహ్మములో, |
| రమతే | = రమిస్తూ ఉంటుందో, |
| ఏవ | = అతని |
| నందతి నందతి నందతి | = ఆనందమే ఆనందం. |

**యోగి అయినా, భోగి అయినా, నలుగురిలో ఉన్నా, ఒంటరిగా ఉన్నా, ఎవని చిత్తము బ్రహ్మములో రమిస్తూ ఉంటుందో, అతని ఆనందమే ఆనందం.**

ఈ శ్లోకాన్ని ఆనందగిరి చెప్పారు. శంకర భాష్యాలకు ఆనందగిరి టీకాలు వ్రాసారు. అందుకని వారిని 'టీకాకారుడు' అంటారు.

**శ్రీ నాన్నగారు**

ఆనందగిరి నిజమైన ఆనందం ఎవరిది అనేది చెబుతున్నారు.

శంకరుడి శిష్యులందరూ సార్థకనామధేయులే!

భగవాన్ బాహ్యంగా ఎక్కడున్నా, ఎలాగున్నా అంతరంగంలో ఆయన సహజంగానే బ్రహ్మములోనే ఉన్నారు, ప్రయత్నపూర్వకంగా కాదు.

ఎవరైతే అలా ఎల్లప్పుడూ ఆత్మనిష్ఠలో ఉంటారో వారిదే నిజమైన శాశ్వతమైన ఆనందం అని చెబుతున్నారు.

జ్ఞానులను చూసి, వారి గురించి విని, అలా నేను కూడా ఆ ఆనందాన్ని ఎందుకు పొందడం లేదు అని మీరు విచారణ చేయాలి.

అంతరంగంలో నిరంతరం సత్సంగం చేస్తూ ఉండాలి.

అలా చేస్తూ పోతుంటే మీరు ఎక్కువకాలం ఆత్మనిష్ఠలో ఉంటారు. ఆ తరువాత మీకు సద్వస్తువు అనుభవంలోకి వస్తుంది. అది అనుభవంలోకి వచ్చాక, మీరు కూడా భగవాన్‌లాగా సహజంగానే అన్నివేళలా బ్రహ్మానందాన్ని పొందుతారు.

✹ ✹ ✹

**భగవద్గీతా కించిదధీతా**
**గంగాజల లవకణికా పీతా ।**
**సకృదపి యేన మురారి సమర్చా**
**క్రియతే తస్య యమాపి న చర్చా ॥** ॥భజ॥ **20**

కించిదధీతా = కించిత్ + అధీతా

| | | |
|---|---|---|
| యేన | = | ఎవనిచేత, |
| భగవద్గీతా | = | భగవద్గీత, |
| కించిత్ | = | కొంచెమైనా, |
| అధీతా | = | అధ్యయనం చేయబడిందో, |
| లవకణికా | = | ఒక చుక్కైనా, |
| గంగాజల | = | గంగాజలం, |
| పీతా | = | త్రాగబడిందో, |
| మురారి | = | మురారికి, |
| సకృదపి | = | ఒక్కసారైనా, |
| సమర్చా | = | పూజ, |
| క్రియతే | = | చేయబడిందో, |
| తస్య | = | అలాంటివాడికి, |
| యమాపి | = | యముడితో, |
| న చర్చా | = | చర్చ ఉండదు. |

**ఎవనిచేత భగవద్గీత కొంచెమైనా అధ్యయనం చేయబడిందో, ఒక చుక్కైనా గంగాజలం త్రాగబడిందో, మురారికి ఒక్కసారైనా పూజ చేయబడిందో, అలాంటివాడికి యముడితో చర్చ ఉండదు.**

ఈ శ్లోకాన్ని దృఢభక్తుడు చెప్పారు.

## శ్రీ నాన్నగారు

ఇక్కడ యముడితో చర్చ ఉండదు అంటే మరణ భయం ఉండదు అని అర్థం చేసుకోవాలి.

భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు ఉపనిషత్తుల సారాన్ని బోధించాడు! ఆ భగవద్గీతలో ఒక శ్లోకాన్ని అధ్యయనం చేస్తే, అంటే అందులోని సారాన్ని మీరు కొంచెమైనా గ్రహించి ఆచరణలో పెడితే, మీకు ఇంక మరణ భయం ఉండదు.

గంగ జ్ఞానానికి చిహ్నం. ఒక చుక్కైనా ఆ జ్ఞానామృతాన్ని మీరు త్రాగితే మీకు మరణ భయం కలగదు.

అంతే కాదు, మురారికి ఒక్కసారైనా పూజ అంటే మీరు మనస్ఫూర్తిగా గోవిందుడిని భజిస్తే, ఆయనే ఈ చావుపుట్టుకలనుండి మిమ్ముల్ని రక్షిస్తాడు అని ఉపదేశం!

✹ ✹ ✹

**పునరపి జననం పునరపి మరణం**
**పునరపి జననీ జఠరే శయనమ్ ।**
**ఇహ సంసారే బహుదుస్తారే**
**కృపయా-పారే పాహి మురారే ॥** **॥భజ॥** **21**

అపారే = అంతం లేనిది,
బహుదుస్తారే = దాటుటకు సాధ్యం కానిది అగు,
ఇహ సంసారే = ఈ సంసార సాగరంలో,
పునరపి = మరల మరల,
జననం = జన్మించడం
పునరపి = మరల మరల,
మరణం = మరణించడం,
పునరపి = మరల తిరిగి,
జననీ జఠరే = తల్లి గర్భంలో,
శయనం = శయనించడం,
(జరగుతూనే ఉంటున్నది),
మురారే = ఓ మురారీ!
కృపయా = దయతో,
పాహి = (నన్ను) రక్షించు.

**అంతం లేనిది, దాటుటకు సాధ్యం కానిది అగు ఈ సంసార సాగరంలో మరల మరల జన్మించడం, మరల మరల మరణించడం, మరల తిరిగి తల్లి గర్భంలో శయనించడం జరగుతూనే ఉంటున్నది. ఓ మురారీ! దయతో నన్ను రక్షించు.**

ఈ శ్లోకాన్ని నిత్యానాధుడు చెప్పారు.

## శ్రీ నాన్నగారు

అసలు విషయాన్ని అందంగా, అద్భుతంగా చెప్పడంలో శంకరుల శిష్యులు అందరూ కూడా గురువుకు తగ్గ శిష్యులు అని ఈ శ్లోకాలు చదువుతుంటే తెలుస్తోంది కదా!

భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు:

**దైవీ హ్యేషా గుణమయీ మమ మాయా దురత్యయా ।**
**మామేవ యే ప్రపద్యంతే మాయామేతాం తరంతి తే ॥** (భగవద్గీత 7-14)

త్రిగుణాత్మికమైన దైవసంబధమైన నా మాయ దాటుటకు కష్టసాధ్యమైనది. ఎవరు నన్నే శరణుపొందుచున్నారో వారు ఈ మాయను దాటివేయగలరు.

సంసారం అంటే అజ్ఞానం. సంసారమనే సాగరాన్ని దాటాలంటే మీరు మాయను దాటాలి. మాయలో ఉన్నంతవరకు జనన మరణాలు తప్పవు. ఆ మాయను దాటడానికి శ్రీకృష్ణుడి బోధను పాటించి ఆయనకు శరణాగతి చేయమని చెబుతున్నారు.

మీలో అహంకారం ఉన్నంతవరకు మీరు సంపూర్ణ శరణాగతి చేయలేరు. అందుకని ముందుగా పాక్షిక శరణాగతితో మొదలుపెట్టండి. నిరంతరం సత్సంగం చేస్తూ పోతుంటే ఆ గోవిందుడి అనుగ్రహంతో సంపూర్ణ శరణాగతి చేయగలుగుతారు, భవసాగరాన్ని దాటగలుగుతారు.

✸ ✸ ✸

**రథ్యా చర్పట విరచిత కంథః**
**పుణ్యాపుణ్య విసర్జిత పంథః ।**
**యోగీ యోగ నియోజిత చిత్తః**
**రమతే బాలోన్మత్తవదేవ ॥** **॥భజ॥** **22**

బాలోన్మత్తవదేవ = బాలోన్మత్తవత్ + ఏవ

| | |
|---|---|
| రథ్యా | = వీధులలో దొరికిన, |
| చర్పట | = గుడ్డముక్కలతో, |
| విరచిత | = చేసిన, |
| కంథః | = బొంతను ధరించి, |
| పుణ్యాపుణ్య | = పుణ్యపాపముల భేదములను, |
| విసర్జిత | = వదిలిన, |
| పంథః | = మార్గం కలవాడై, |
| యోగీ | = యోగి, |
| చిత్తః | = తన చిత్తమును, |
| యోగ నియోజిత | = బ్రహ్మమునందుంచి, |
| బాలోన్మత్తవదేవ | = బాలుడిలాగా, పిచ్చివాడిలాగా, |
| రమతే | = ఆనందంతో ఉంటాడు. |

**వీధులలో దొరికిన గుడ్డముక్కలతో చేసిన బొంతను ధరించి, పుణ్యపాపముల భేదములను వదిలినవాడై యోగి తన చిత్తమును బ్రహ్మమునందుంచి బాలుడిలాగా, పిచ్చివాడిలాగా ఆనందంతో ఉంటాడు.**

ఈ శ్లోకాన్ని యోగానందుడు చెప్పారు.

## శ్రీ నాన్నగారు

ఈ శ్లోకంలో అందరూ కాదు, కొందరు జ్ఞానులు ఎలా ఉంటారు  అనేదాని గురించి చెబుతున్నారు.

బాలుడి లాగా, పిచ్చివాడిలాగా అని ఎందుకు అన్నారంటే:
బాలుడిలో రాగద్వేషాలు ఉండవు. పిచ్చివాడి నవ్వుకు ఏ కారణం కనిపించదు. అలాగే, రాగద్వేషాలు లేని జ్ఞానిలో ఆనందం సహజంగా  ఉంటుంది. అందుకు ఎటువంటి కారణం ఉండదు.

కొంతమంది జ్ఞానులను చూసినప్పుడు వారు మీకు పిల్లల్లాగానో, పిచ్చివారిలాగానో కనిపించవచ్చు. వారిని నిశితంగా గమనిస్తే కాని వారి ఆనందం గురించి మీకు తెలియదు. జ్ఞానులందరూ అలా ఉండరు.

బ్రహ్మానందం మాత్రం జ్ఞానులందరిలో ఉంటుంది.

✹✹✹

**కస్త్వం కోఽహం కుత ఆయాతః**
**కా మే జననీ కో మే తాతః ।**
**ఇతి పరిభావయ సర్వమసారం**
**విశ్వం త్యక్త్వా స్వప్న విచారమ్ ॥** **॥భజ॥** **23**

కస్త్వం = కః + త్వం
కోఽహం = కః + అహం
సర్వమసారం = సర్వం + అసారం

త్వం = నువ్వు,
కః = ఎవరు?
అహం = నేను,
కః = ఎవరు?
కుత = ఎక్కడనుండి,
ఆయాతః = వచ్చాం?
మే = నాకు,
జననీ = తల్లి,
కా = ఎవరు?
మే = నాకు,
తాతః = తండ్రి,
కో = ఎవరు?
ఇతి = ఈ విధంగా,
పరిభావయ = విచారించి,
అసారం = సారం లేని,
సర్వం విశ్వం = సమస్త ప్రపంచం,

స్వప్న = స్వప్నంతో సమానమని,

విచారం = భావించి,

త్యక్త్వా = విడిచిపెట్టు.

**నువ్వు ఎవరు? నేను ఎవరు? ఎక్కడనుండి వచ్చాం? నాకు తల్లి ఎవరు? నాకు తండ్రి ఎవరు? ఈ విధంగా విచారించి సారం లేని సమస్త ప్రపంచం స్వప్నంతో సమానమని భావించి విడిచిపెట్టు.**

ఈ శ్లోకాన్ని సురేంద్రుడు చెప్పారు.

ముక్తికోపనిషత్తులో శ్రీరాముడు "మాండూక్యం ఏకమేవాలం" అంటే ఒక్క మాండూక్యోపనిషత్తు ముముక్షువులకు ముక్తిని కలగచేయడానికి సరిపోతుంది అని అన్నాడు.

మాండూక్యోపనిషత్తులో పన్నెండు మంత్రాలే ఉన్నాయి. సరైన వివరణలు లేకుండా ఆ మంత్రాలను అర్థం చేసుకోవడం కష్టం కనుకనే శంకరుల గురువుగారి గురువైన గౌడపాదులవారు 215 కారికలు చెప్పారు.

శంకరులు ఆ మంత్రాలతోపాటు కారికలకు కూడా భాష్యం చెప్పారు.
ఆ 12 మంత్రాలను, 215 కారికలను కలిపి నాలుగు ప్రకరణాలుగా చేశారు. అవి ఆగమ ప్రకరణం, వైతథ్య ప్రకరణం, అద్వైత ప్రకరణం, అలాతశాంతి ప్రకరణం.

'వైతథ్యం' అంటే అసత్యం. వైతథ్య ప్రకరణంలో ఈ జగత్తు ఏ విధంగా మిథ్య, సర్వం మనోకల్పితం అనేది యుక్తులతో, తర్కంతో వివరంగా చెప్పారు.

ఆ వైతథ్య ప్రకరణంలోని కొన్ని అమూల్యమైన కారికలు:

**ఆదిలో, అంతంలో ఏది లేదో అది వర్తమానంలో (మధ్యలో) కూడా లేనటువంటిదే. అలా వర్తమానంలో ఉన్నవి అసత్యంతో సమానమైనవే. కాని అవి సత్యములు అని అవివేకులు అనుకుంటారు.** (వై. ప్ర. 2-6)

ఎండమావులకు జన్మలేదు, మృత్యువు లేదు, కావున స్థితియు లేదు. మధ్యకాలంలో అవి ఉన్నట్లు అవివేకులకు కనిపిస్తాయి కాని వాస్తవానికి మధ్యకాలంలో కూడా అవి లేవు. అలాగే రజ్జుసర్పము, ముత్యపుచిప్ప వెండి మొదలైనవి అసత్యములు. ఇవి భ్రాంతిలో ఉన్నాయి కాని వాస్తవంలో లేవు. అలాగే, వాస్తవానికి జాగ్రత్ దృశ్యములు అన్నీ కూడా అసత్యములే.

**స్వప్నసమయంలో స్వప్నమును చూచువాడు తాను మనస్సులో భావించిన దానిని అసత్యం అని, అదే స్వప్నంలో చూచిన దానిని సత్యం అని భావిస్తున్నాడు.నిజానికి ఈ రెండు కూడా స్వప్నజగత్తుకు సంబంధించినవి అవడంవలన మిథ్యయే.**
(వై. ప్ర. 2-9)

**అలాగే,జాగ్రదవస్థలో కూడా జీవి తాను మనస్సులో భావించిన దానిని అసత్యం అని, బాహ్యజగత్తులో తన ఎదుట చూస్తున్నదానిని సత్యం అని భావిస్తున్నాడు. కాని బాగా విచారణ చేస్తే ఈ రెండు కూడా అసత్యములు అనియే చెప్పవచ్చును.**
(వై. ప్ర. 2-10)

జాగ్రత్తులో గాని, స్వప్నంలో గాని అనుభవింపబడు బాహ్య అంతరంగిక వృత్తులు (ఆలోచనలు) అన్నీ కూడా మనోకల్పితములు అవటంవలన అసత్యములు అని భావం.

శంకరాచార్యులవారు శ్రీ దక్షిణామూర్తి స్తోత్రంలో ఇలా చెప్పారు:

**విశ్వం దర్పణ దృశ్యమాన నగరీతుల్యం నిజాంతర్గతం**
**పశ్యన్నాత్మని మాయయా బహిరివోద్భూతం యథా నిద్రయా**
**యస్సాక్షాత్కురుతే ప్రభోదసమయే స్వాత్మానమేవాద్వయం**
**తస్మై శ్రీ గురుమూర్తయే నమ ఇదం శ్రీ దక్షిణామూర్తయే ॥**

ప్రపంచం అద్దంలో కనిపించే నగరంతో సమానమైనది, తనలోనే (ఆత్మలోనే) ఉన్నా, కలలోలాగా తనలోనే చూస్తున్నా మాయవల్ల బయట ఉద్భవించినదానివలె అనిపిస్తుంది. జ్ఞానం కలిగినప్పుడు ఎవరు రెండోది లేని తన ఆత్మస్వరూపమునే అనుభవపూర్వకంగా తెలుసుకుంటాడో అట్టి గురుస్వరూపుడగు శ్రీ దక్షిణామూర్తికి ఈ నమస్కారము.

కలగనేటప్పుడు కలలోని అనుభవాలు, మనుషులు, ప్రదేశాలు అన్నీ బయట ఉన్నాయనిపిస్తోంది. మెలుకువ వచ్చిన తర్వాత ఉన్నదొక్క మనస్సేనని అందులోనే కల చూడబడిందని అర్థమవుతుంది. అలాగే అజ్ఞానంలో ప్రపంచం బయట ఉన్నట్లు కనిపిస్తోంది. జ్ఞానం వచ్చాక ప్రపంచం మనలోనే కనిపించిందని అర్థం అవుతుంది.

మనం చూసేదంతా నిజం కాదని తరచుగా ఋజువు అవుతూనే ఉంది. సూర్యుడు తిరగడాన్ని రోజూ చూస్తూనే ఉన్నా సూర్యుడు తిరగడం లేదని మనకు నిశ్చయంగా తెలుసు. ఎంతో స్థిరంగా నిలబడి ఉన్నట్లుగా అనిపించే భూమి తన కక్ష్యలో తాను పరిభ్రమిస్తుందని మనకి తెలిసిన విషయమే. ఇదే విధంగా మసక చీకటిలో తాడు పాముగా భయపెట్టగలదు. తాడు అని తెలిస్తే పాము ఉండదు. సత్యాన్ని గుర్తించకపోవడమే నానాత్వ ప్రపంచాన్ని గుర్తించడానికి కారణమవుతోంది.

## శ్రీ నాన్నగారు

నేను ఎవరు? మొదలైన ప్రశ్నలతో విచారణ చేసి "బ్రహ్మ సత్యం, జగత్తు మిథ్య" అని మిమ్మల్ని తెలుసుకోమంటున్నారు.

"ప్రపంచం కళ్ళకు కనిపిస్తోంది, అనేక విధాలుగా అనుభవంలోకి వస్తోంది. అలాంటి ప్రపంచం ఏదో కల లాంటిదా?" అని భగవాన్‌ని (రమణ మహర్షిని) ఒక భక్తుడు అడిగాడు. అందుకు భగవాన్ "నీవు లేని సర్పాన్ని చూస్తున్నంతవరకు దానిని తాడు అని నువ్వు చూడలేవు. అసలు లేని సర్పం ఉన్నట్టు అనిపిస్తుంది, నిజంగా ఉన్న రజ్జువు (తాడు) లేనట్టు అనిపిస్తుంది. అలాగే, నువ్వు చూస్తున్న ప్రపంచం సత్యం అని నువ్వు అనుకున్నంత కాలం నీ మనస్సు లేని ప్రపంచాన్ని చూస్తుంది కాని, ఉన్న బ్రహ్మాన్ని చూడదు" అన్నారు.

ఆ భక్తుడు "జగత్తు సత్యం అనిపిస్తోంది గాని, అసత్యం అని నమ్మబుద్ధి కావడం లేదు" అన్నాడు. అందుకు భగవాన్ "నువ్వు కలలో ఉన్నప్పుడు ఆ కలలో కనిపించేది సత్యం అనుకుంటావు. మెలుకువ వచ్చాక కలలో చూసింది అసత్యం అని తెలుసుకుంటావు. అలాగే, అజ్ఞానంలో ఉన్నప్పుడు, జాగ్రదవస్థలోని ప్రపంచం సత్యం అనిపిస్తుంది. జ్ఞానం వచ్చాక ఆ ప్రపంచం అసత్యం అని తెలుస్తుంది" అన్నారు.

మీరు గాఢనిద్రలో ఉన్నప్పుడు మనస్సు లేదు, ప్రపంచమూ లేదు. మెలుకువ వచ్చాక మనస్సు వస్తోంది, మనస్సుతోపాటు ప్రపంచమూ వస్తోంది. విచారణ చేస్తే జాగ్రదవస్థలో కనిపించేది కూడా స్వప్న దృశ్యం లాగా మనోకల్పితం అని మీకు తెలుస్తుంది. అప్పుడు కలలోని విషయాలను పట్టించుకోనట్లే బాహ్యవిషయాలను వదిలేసి అంతర్ముఖులై సత్యాన్ని తెలుసుకుంటారు.

✷ ✷ ✷

**త్వయి మయి చాన్యత్రైకో విష్ణుః**
**వ్యర్థం కుప్యసి మయ్యసహిష్ణుః ।**
**భవ సమచిత్తః సర్వత్ర త్వం**
**వాంఛస్య చిరాద్యది విష్ణుత్వమ్ ॥** ॥భజ॥ **24**

చాన్యత్రైకో = చ + అన్యత్ర + ఏకః
మయ్యసహిష్ణుః = మయి + అసహిష్ణుః
వాంఛస్యచిరాద్యది = వాంఛసి + అచిరాత్ + యది

త్వయి = నీలోను,
మయి చ = నాలోనూ,
అన్యత్ర = అంతటా (ఉన్నది),
విష్ణుః = సర్వవ్యాపి అయిన భగవంతుడు,
ఏక = ఒక్కడే,
అసహిష్ణుః = సహనం లేనివాడవై,
వ్యర్థం = అనవసరంగా,
మయి = నాపై,
కుప్యసి = కోపగించకు,
త్వం = నువ్వు,
అచిరాత్ = త్వరగా,
విష్ణుత్వం = విష్ణువులో ఐక్యమును,
వాంఛసి యది = పొందాలి అనుకుంటే,
సర్వత్ర = అంతటా,
సమచిత్తః = సమదృష్టిని కలిగి,
భవ = ఉండాలి.

**నీలోను, నాలోనూ, అంతటా ఉన్నది సర్వవ్యాపి అయిన భగవంతుడు ఒక్కడే. సహనం లేనివాడవై, అనవసరంగా నాపై కోపగించకు. నువ్వు త్వరగా విష్ణువులో ఐక్యమును పొందాలి అనుకుంటే అంతటా సమదృష్టిని కలిగి ఉండాలి.**

ఈ శ్లోకాన్ని మేధాతిథి చెప్పారు.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు:

**సర్వభూతస్థమాత్మానం సర్వభూతాని చాత్మని ।**
**ఈక్షతే యోగయుక్తాత్మా సర్వత్ర సమదర్శనః ॥** (భగవద్గీత 6-29)

యోగయుక్తాత్ముడు (మనస్సును ఆత్మయందు ఐక్యం చేసిన యోగి) అంతటా సమదృష్టి గలవాడై తనను సర్వప్రాణులలో ఉన్నవానిగాను, తనలో సర్వప్రాణులను దర్శిస్తాడు.

సమదర్శనుడు అంటే సమదృష్టి గలవాడు అంటే బ్రహ్మ మొదలు గడ్డిపరక వరకు గల సమస్త ప్రాణులలో విశేషాలు (నామరూపాదులు) ఏమీ చూడకుండా బ్రహ్మమునే చూసేవాడు.

### శ్రీ నాన్నగారు

ఇక్కడ విష్ణువు అంటే భగవంతుడు అని అర్థం చేసుకోవాలి.

భగవాన్‌కి ఆ సమదృష్టి ఉండేది. మనుషులలోనే కాదు, పశుపక్ష్యాదులలో కూడా ఆయన బ్రహ్మమునే చూసేవారు. ఆ దృష్టి కలగడం అంత తేలిక కాదు.

చంచలమైన మనస్సుతో ఉన్న నాకు సమదర్శనం చాలా కష్టంగా ఉంది దానికి ఉపాయం చెప్పండి అని అర్జునుడు శ్రీకృష్ణ భగవానుడిని అడిగాడు.

(భగవద్గీత 6 - 33, 34)

అప్పుడు శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు:

**అసంశయం మహాబాహో మనో దుర్నిగ్రహం చలమ్ ।**
**అభ్యాసేన తు కౌంతేయ వైరాగ్యేణ చ గృహ్యతే ॥** (భగవద్గీత 6 – 35)

అర్జునా! మనస్సు చంచలం, దాన్ని నిగ్రహించడం కష్టం. ఇందులో సందేహం లేదు. అభ్యాస వైరాగ్యములచేత దానిని నిగ్రహించవచ్చు.

ఈ లోకంలోని, స్వర్గలోకంలోని భోగాలమీద ఇష్టం లేకపోవడం వైరాగ్యం. నిత్య, అనిత్య వస్తు వివేకంతో కూడిన వైరాగ్యం మీకు కలగాలని ఆచార్యులవారు ఈ భజగోవిందంలో చాలా శ్లోకాలు చెప్పారు.

అభ్యాసం అంటే సాధన ఎలా చేయాలనేది కూడా శంకరులు తొమ్మిదవ శ్లోకంలో చెప్పారు. అలా సాధన చేస్తూ సత్సంగంనుండి మీరు నిశ్చలతత్త్వం పొందినప్పుడు సమదృష్టి మీకు కలుగుతుంది.

ఆ మనస్సుని నిగ్రహించుకోవడానికి మీరు సాధన చేసే సమయంలో మీకు శ్రద్ధ, సహనం చాలా అవసరం!

✸ ✸ ✸

**శత్రౌ మిత్రే పుత్రే బంధౌ**
**మా కురు యత్నం విగ్రహ సంధౌ ।**
**సర్వస్మిన్నపి పశ్యాత్మానం**
**సర్వత్రోత్సృజ భేదాజ్ఞానమ్ ॥** ॥భజ॥ **25**

| | |
|---|---|
| సర్వస్మిన్నపి | = సర్వస్మిన్ + అపి |
| పశ్యాత్మానాం | = పశ్య + ఆత్మానం |
| సర్వత్రోత్సృజ | = సర్వత్ర + ఉత్సృజ |
| భేదాజ్ఞానమ్ | = భేద + అజ్ఞానమ్ |

| | |
|---|---|
| శత్రౌ | = శత్రువులతో, |
| మిత్రే | = మిత్రులతో, |
| పుత్రే | = సంతానంతో, |
| బంధౌ | = బంధువులతో, |
| విగ్రహ | = శత్రుత్వం కోసం, |
| సంధౌ | = స్నేహం కోసం, |
| యత్నం | = ప్రయత్నాలు, |
| మా కురు | = చేయవద్దు, |
| సర్వస్మిన్ అపి | = అన్నింటిలోనూ, |
| ఆత్మానం | = ఆత్మనే, |
| పశ్య | = దర్శించు, |
| భేద అజ్ఞానం | = భేదరూపమైన అజ్ఞానాన్ని, |
| సర్వత్ర | = పూర్తిగా, |
| ఉత్సృజ | = వదిలిపెట్టు. |

**శత్రువులతో, మిత్రులతో, సంతానంతో, బంధువులతో శత్రుత్వం కోసం, స్నేహం కోసం ప్రయత్నాలు చేయవద్దు. అన్నింటిలోనూ ఆత్మనే దర్శించు. భేదరూపమైన అజ్ఞానాన్ని పూర్తిగా వదిలిపెట్టు.**

## శ్రీ నాన్నగారు

రాగద్వేషాలు మీకుంటే వాటితో పాటు సుఖదుఃఖాలు వచ్చేస్తాయి.

రాగద్వేషాలు నేను, ఇతరులు అన్న భేద బుద్ధిని మీలో పెంచుతాయి.

రాగద్వేషాలున్నంత కాలం మీరు సంసారంనుండి బయటపడలేరు. అందుకని ఎవరిమీదా రాగద్వేషాలు పెట్టుకోవద్దు.

సమదర్శనం చేయండి, మీకంటే అన్యంగా మరొకటి ఉందనుకునే అజ్ఞానాన్ని వదిలేయండి అని హితబోధ!

✹ ✹ ✹

**కామం క్రోధం లోభం మోహం**
**త్యక్త్వాఽఽ త్మానం పశ్యతి సోఽ హమ్ ।**
**ఆత్మజ్ఞాన విహీన మూఢాః**
**తే పచ్యన్తే నరక నిగూఢాః ॥** **॥భజ॥** **26**

తక్త్వాఽఽ త్మానం = తక్త్వా + ఆత్మానాం
సోఽ హమ్ = సః + అహం

కామం = కామమును,
క్రోధం = క్రోధమును,
లోభం = లోభమును,
మోహం = మోహమును,
త్యక్త్వా = వదిలినవాడు,
ఆత్మానం = ఆత్మను,
సః అహం = తానే అది (అని),
పశ్యతి = తెలుసుకుంటాడు,
ఆత్మజ్ఞాన విహీన = ఆత్మజ్ఞానం పొందని,
మూఢాః = మూఢులు,
నరక నిగూఢాః = నిగూఢమైన నరకంలో,
పచ్యంతే = బాధలు అనుభవిస్తారు.

**కామ, క్రోధ, లోభ, మోహములను వదిలినవాడు తానే ఆత్మను అని తెలుసుకుంటాడు. ఆత్మజ్ఞానం పొందని మూఢులు నిగూఢమైన నరకంలో బాధలు అనుభవిస్తారు.**

ఈ శ్లోకాన్ని భారతీవంశుడు చెప్పారు.

ఆరు కలిస్తే షడ్వర్గం అంటారు. అరి అంటే శత్రువు. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మాత్సర్యాలు అను ఆరుగురు శత్రువులను అరిషడ్వర్గం అంటారు. ఇవి ఎవరిలో ఉంటాయో వారికి అవి శత్రువులు.

సంస్కృతంలో కామం అంటే కోరిక. క్రోధం అంటే కోపం. లోభం అంటే తనది కాని దానిని తనది కావాలని కోరుకోవటం. మోహం అంటే అజ్ఞానం, ఆత్మజ్ఞానం లేకపోవటం. మదం అంటే ఇతరులకన్నా తాను అధికం అన్న అహంకారం. మాత్సర్యం అంటే అసూయ.

శ్రీకృష్ణభగవానుడు ఇలా చెప్పాడు:

**విషయములగురించి ఆలోచిస్తున్నవానికి, వాటియందు ఆసక్తి కలుగుతుంది. ఆసక్తివలన కామం పుడుతుంది. కామంవలన క్రోధం కలుగుతుంది. క్రోధంవలన మోహం కలుగుతుంది. మోహంవలన స్మృతి నశిస్తుంది (మరపు కలుగుతుంది). స్మృతి నశించడంవలన బుద్ధి నశిస్తుంది. బుద్ధి నశించడంవలన సర్వనాశనం అవుతుంది.** (భగవద్గీత 2-62,63)

**కామం, క్రోధం, లోభం అనునవి ఆత్మనాశనం కలిగించే మూడు నరక ద్వారములు. కనుక ఈ మూడింటిని వదలవలెను.** (భగవద్గీత 16-21)

సంకల్పాలు మనస్సులో పుడతాయి. ఆ సంకల్పాలనుండి కోరికలు, ఆశలు పుడతాయి.

శ్రీకృష్ణభగవానుడు భగవద్గీతలో రెండు అమూల్యమైన శ్లోకాలలో ఆత్మయందు మనస్సును ఉంచడానికి ఎలా సాధన చేయాలి అనేది చెప్పారు:

**సంకల్ప ప్రభవాన్ కామాన్ త్యక్త్వా సర్వానశేషతః ।**
**మనసా ఏవ ఇంద్రియగ్రామం వినియమ్య సమంతతః ॥**

**శనైః శనైః ఉపరమేత్ బుద్ధ్యా ధృతిగృహీతయా ।**
**ఆత్మసంస్థం మనః కృత్వా న కించిదపి చింతయేత్ ॥**

(భగవద్గీత 6-24,25)

సంకల్పంవలన కలిగే కోరికలను అన్నింటిని పూర్తిగా విడిచి, వివేకం కలిగిన మనస్సుతో అన్ని ఇంద్రియాలను సమస్త విషయాలనుండి నిగ్రహించాలి. తరువాత ధైర్యంగల బుద్ధిచేత మెల్లమెల్లగా మనస్సును విషయాలనుండి మరలించి ఆత్మయందు స్థిరంగా ఉంచి, వేరే దేని గురించి కూడా ఆలోచించకుండా ఉండాలి.

## శ్రీ నాన్నగారు

మిమ్మల్ని పాడుచేయడానికి బయటవాళ్ళు అక్కర్లేదు, అరిషడ్వర్గాలు అనే మీలోపల ఉన్న మీ శత్రువులు చాలు. ముందు మీరు అరిషడ్వర్గాలను జయించాలనే పెద్దలు "ఇంట గెలిచి రచ్చ గెలవాలి" అన్నారు.

అలా చేయకపోతే మీకు ఆత్మజ్ఞానం కలగదు, మీరు నిగూఢమైన నరకంలో పడతారు అంటున్నారు. నిగూఢమైన నరకం అంటే వేరే ఏదో కాదు సంసారమే. ఈ సంసారంలో అంటే అజ్ఞానంలో మీరు అనేక బాధలు పడుతూనే ఉన్నారు కదా!

✸ ✸ ✸

**గేయం గీతా నామ సహస్రం**
**ధ్యేయం శ్రీపతి రూపమజస్రమ్ ।**
**నేయం సజ్జన సంగే చిత్తం**
**దేయం దీనజనాయ తు విత్తమ్ ॥** **॥భజ॥** **27**

రూపమజస్రం = రూపం + అజస్రం

| | | |
|---|---|---|
| గీతా | = | భగవద్గీతను, |
| నామ సహస్రం | = | విష్ణు సహస్ర నామాలను, |
| గేయం | = | చదవండి, |
| అజస్రం | = | నిరంతరం, |
| శ్రీపతి రూపం | = | విష్ణు స్వరూపంపై మనస్సు నిలిపి, |
| ధ్యేయం | = | ధ్యానం చేయండి, |
| సజ్జన సంగే | = | సజ్జనులతో సహవాసం, |
| నేయం | = | చేయండి, |
| దీనజనాయ | = | దీనులకు, |
| విత్తం తు | = | ధనసహాయం, |
| దేయం | = | చేయండి. |

**భగవద్గీతను, విష్ణు సహస్రనామాలను చదవండి. నిరంతరం విష్ణు స్వరూపంపై మనస్సును నిలిపి ధ్యానం చేయండి. సజ్జనులుతో సహవాసం చేయండి. దీనులకు ధనసహాయం చేయండి.**

మొదటి పన్నెండు శ్లోకాలను శంకరులు చెప్పారు. తరువాత ఆచార్యులవారి ఆదేశం ప్రకారం వారి శిష్యులు పద్నాలుగు శ్లోకాలు చెప్పారు. ఆ తరువాత అయిదు శ్లోకాలు (ఈ శ్లోకంనుండి చివరి శ్లోకం వరకు) శంకరులవారు చెప్పారు.

## శ్రీ నాన్నగారు

ఈ శ్లోకంలో ఆచార్యులవారు భజగోవిందం అనేది మీ జీవన విధానంలో ఎలా ఉండాలి అనేది చెబుతున్నారు.

భగవద్గీతను చదవండి అంటే గురువు ఉపదేశానుసారం అందులోని శ్లోకాల సారాన్ని శ్రవణ మననాలు చేసి సత్సంగం చేయమని భావం.

కలియుగంలో భగవన్నామ స్మరణ మిమ్ముల్ని భగవంతుని దగ్గరకు చేరుస్తుంది. అందువలన, విష్ణు సహస్రనామాలను అర్థం చేసుకుని భక్తితో పారాయణం చేయండి.

భగవద్గీతలో శ్రీకృష్ణుడు ఇలా చెప్పాడు:

**మన్మనా భవ మద్భక్తో మద్యాజీ మాం నమస్కురు ।**
**మామే వైష్యసి సత్యం తే ప్రతిజానే ప్రియోஉసి మే ॥** (భగవద్గీత 18-65)

నాయందు మనస్సునుంచు. నాయందు భక్తితో ఉండు. నన్ను ఆరాధించు. నాకు నమస్కరించు. నన్నే చేరుకుంటావు. నీవు నాకు ప్రియుడవని సత్యప్రతిజ్ఞ చేస్తున్నాను.

భగవంతునియందు మనస్సునుంచడానికి శ్రీపతి అంటే విష్ణువుని కాని లేక మీ ఇష్టదైవాన్ని కాని నిరంతరం ధ్యానం చేయండి.

ఇంకా 'మానవసేవే మాధవసేవ' భావంతో దీనులకు సహాయం చేస్తే చిత్తశుద్ధి కలుగుతుంది.

✸✸✸

**సుఖతః క్రియతే రామా భోగః**
**పశ్చాద్ధంత శరీరే రోగః ।**
**యద్యపి లోకే మరణం శరణం**
**తదపి న ముంచతి పాపాచరణమ్ ॥** **॥భజ॥** **28**

పశ్చాద్ధంత = పశ్చాత్ + అంత

సుఖతః = (మానవుడు) సుఖంకోసం,
రామా భోగః = స్త్రీ భోగాన్ని,
క్రియతే = అనుభవిస్తాడు,
పశ్చాత్ = ఆ తరువాత,
అంత = చివరకు,
శరీరే = శరీరం,
రోగః = రోగగ్రస్థం అవుతుంది,
యద్యపి = ఈ విధంగా,
లోకే = (ఈ) లోకంలో,
మరణం = మరణం,
శరణం = తప్పదని,
తదపి = తెలిసినా,
(మానవులు),
పాపాచరణం = పాపాలను చేయడం,
న ముంచతి = మానడం లేదు!

**మానవుడు సుఖంకోసం స్త్రీ భోగాన్ని అనుభవిస్తాడు. కానీ చివరకు శరీరం రోగగ్రస్థం అవుతుంది. ఈ లోకంలో మరణం తప్పదని తెలిసినా, మానవులు పాపాలను చేయడం మానడం లేదు!**

## శ్రీ నాన్నగారు

కాంతా వ్యామోహంలో పడవద్దని ఇంతకు ముందు మూడవ శ్లోకంలో ఆచార్యులవారు చెప్పారు. మాములు మనుష్యులే కాదు, విశ్వామిత్రుడు లాంటి మహర్షులు, రావణాసురుడు లాంటి గొప్పవాళ్ళు కూడా స్త్రీ–పురుష వ్యామోహంలో పడి పతనమయ్యారు. అందుకే, శంకరులు కాంతా వ్యామోహాన్ని మళ్ళీ ఇక్కడ ప్రస్తావిస్తున్నారు.

మీరు కూడా పొరపాటు పనులు చేసి జీవితాన్ని పాడు చేసుకోవద్దని మీ మీద ప్రేమతో ఆచార్యులవారు పదే పదే చెబుతున్నారు.

"తాత్కాలికమైన సుఖాలకోసం పరుగులు తీస్తే, చివరకు దుఃఖమే మిగులుతుంది. శాశ్వతమైన బ్రహ్మానందం కోసం నిరంతరం సత్సంగం చేద్దాం. మనస్సుని విషయాలమీద కాకుండా భగవంతునియందు ఉంచుదాం" అని మీకు మీరు ఎప్పటికప్పుడు చెప్పుకుంటూ ఉండాలి.

భగవద్గీతలో శ్రీకృష్ణ భగవానుడు చాలా చక్కగా చెప్పాడు:

**ఉద్ధరేదాత్మనాஉஉత్మానం నాత్మానమవసాదయేత్ ।**

**ఆత్మైవ హి ఆత్మనో బంధుః ఆత్మైవ రిపుః ఆత్మనః ॥** (భగవద్గీత 6–5)

తనను తాను ఉద్ధరిచుకోవాలి. తనను తాను క్రిందికి పడదోసుకోకూడదు. తనకు తానే బంధువు. తనకు తానే శత్రువు.

గురుపరంపర మీమీద చూపించే ప్రేమను మీరు అర్థం చేసుకొని వారి బోధలను ఆచరణలో పెడితే మీ జీవితం ధన్యం అవుతుంది.

✸ ✸ ✸

**అర్థమనర్థం భావయ నిత్యం**
**నాస్తి తతః సుఖలేశః సత్యమ్ ।**
**పుత్రాదపి ధనభాజాం భీతిః**
**సర్వత్రైషా విహితా రీతిః ।। ।।భజ।। 29**

అర్థమనర్థం = అర్థం + అనర్థం
సర్వత్రైషా = సర్వత్ర + ఏషా
పుత్రాదపి = పుత్రాత్ + అపి

అర్థం = ధనం,
అనర్థం = అనర్థమైనదని,
తతః = ఆ ధనంవలన,
సుఖలేశః = కొంచెం కూడా సుఖం,
నాస్తి = లేదని,
నిత్యం = నిత్యం (అన్నివేళలా),
భావయ = గుర్తుంచుకో,
(ఇది),
సత్యం = సత్యం,
ధనభాజాం = ధనవంతులు,
పుత్రాదపి = తమ సంతానానికి కూడా,
భీతిః = భయపడతారు,
సర్వత్రా = ప్రపంచమంతా,
ఏషా = ఈ,
రీతిః = విధంగానే,
భవ = ఉంది.

**ధనం అనర్థమైనదని, ఆ ధనంవలన కొంచెం కూడా సుఖం లేదని నిత్యం గుర్తుంచుకో. ఇది సత్యం. ధనవంతులు తమ సంతానానికి కూడా భయపడతారు. ప్రపంచమంతా ఈ విధంగానే ఉంది.**

## శ్రీ నాన్నగారు

కనీస సుఖాలు అనుభవించడానికి మించి ఎక్కువ ధనం సంపాదించాలని పరుగులు పెట్టవద్దని రెండవ శ్లోకంలో ఆచార్యులవారు చెప్పారు.

ధనం అనర్థమైనది అంటే కీడు కలిగించేది, దానివలన కొంచెం కూడా సుఖం లేదని మిమ్మల్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకోమంటున్నారు. ధనంవలన చాలా సుఖాలు వస్తాయి కదా, ఇది నిజం కాదని మీరు అనుకుంటారని, ఆయన చెప్పేది సత్యం అని నొక్కి మరీ చెబుతున్నారు.

ఎలాగంటే, ఆ ధనం ఎక్కువగా సంపాదించడానికి మీరు చాలా కష్టపడాలి కాబట్టి సంపాదించేటప్పుడు మీకు సుఖం లేదు. అలా సంపాదించిన తరువాత దానిని కాపాడుకోవడానికి, ఇంకా పెంచడానికి ఆ తరువాత కూడా మీరు కష్టపడాలి. ఇంక మీకు సుఖం ఎక్కడుంది?

ధనవంతులకు బయటవాళ్ళనుండే కాదు, సంతానంనుండి కూడా ప్రమాదమే. ఇలా జరిగినవాటి గురించి చరిత్రలో విన్నారు. ఇప్పుడు కూడా లోకం పోకడ అలాగే ఉంది.

అందువలన, ధనవ్యామోహంలో పడి కొట్టుకుపోకుండా, మీరు వచ్చిన పని చూసుకొని అంటే సద్వస్తువును తెలుసుకొని బ్రహ్మానందాన్ని అనుభవించండి.

✸ ✸ ✸

**ప్రాణాయామం ప్రత్యాహారం**
**నిత్యానిత్య వివేక విచారమ్ ।**
**జాప్యసమేత సమాధి విధానం**
**కుర్వవధానం మహదవధానమ్ ॥** **॥భజ॥** **30**

నిత్యానిత్య = నిత్య + అనిత్య
కుర్వవధానం = కురు + అవధానం
మహదవధానమ్ = మహత్ + అవధానమ్

ప్రాణాయామం = ప్రాణాయామం,
ప్రత్యాహారం = ప్రత్యాహారం (ఇంద్రియ నిగ్రహం),
నిత్యానిత్య = ఏది నిత్యం, ఏది అనిత్యం అనునది,
వివేక విచారం = వివేకంతో కూడిన విచారణ,
జాప్యసమేత = జపంతో కూడిన,
సమాధి విధానం = సమాధి సాధన,
అవధానం = ఏకాగ్ర బుద్ధితో,
మహదవధానం = ఎక్కువ ఏకాగ్ర బుద్ధితో,
కురు = చేయండి.

**ప్రాణాయామం, ప్రత్యాహారం (ఇంద్రియ నిగ్రహం), నిత్య అనిత్య వివేక విచారణ, జపంతో కూడిన సమాధి సాధన ఏకాగ్ర బుద్ధితో, ఎక్కువ ఏకాగ్ర బుద్ధితో చేయండి.**

ఈ శ్లోకంలో శంకరులు యోగమార్గం గురించి చెబుతున్నారు. యమం, నియమం, ఆసనం, ప్రాణాయామం, ప్రత్యాహారం, ధారణ, ధ్యానం, సమాధి అనే ఈ ఎనిమిది యోగాంగాలు.

## శ్రీ నాన్నగారు

ప్రాణాయామంవలన మనస్సు నిగ్రహింపబడి ఏకాగ్రత కలుగుతుంది.

ప్రత్యాహారం అంటే ఇంద్రియాలను ఇంద్రియ విషయాలమీదకి పోనివ్వకుండా చేయడం. అలా చేస్తే ఇంద్రియాలు నిగ్రహింపబడి ఏకాగ్రత పెరుగుతుంది.

ఏది నిత్యం, ఏది అనిత్యం అనేది వివేకంతో విచారణ చేస్తే, అనిత్య వస్తువులపై వైరాగ్యం వస్తుంది.

జపంతో ఏకచింతన అంటే దైవచింతన చేయాలి.

మీరు మీ లక్ష్యం చేరుకోవడానికి వీటన్నింటినీ ఎక్కువ ఏకాగ్ర బుద్ధితో సాధన చేయమని ఆచార్యులవారి బోధ.

✹✹✹

**గురుచరణాంబుజ నిర్భర భక్తః**
**సంసారాత్ అచిరాత్ భవ ముక్తః ।**
**సేంద్రియ మానస నియమాదేవం**
**ద్రక్ష్యసి నిజ హృదయస్థం దేవమ్ ॥** ॥భజ॥ **31**

| | | |
|---|---|---|
| గురుచరణాంబుజ | = | గురుచరణ + అంబుజ |
| సేంద్రియ | = | సః + ఇంద్రియ |
| నియమాదేవం | = | నియమాత్ + ఏవం |

| | | |
|---|---|---|
| గురుచరణాంబుజ | = | గురుదేవుల పాదపద్మములపై, |
| నిర్భర భక్తః | = | పరిపూర్ణమైన భక్తి కలవాడవై, |
| సేంద్రియ | = | ఇంద్రియాలను, |
| మానస | = | మనస్సును, |
| నియమాత్ | = | నిగ్రహించి, |
| అచిరాత్ | = | అతి త్వరలోనే, |
| సంసారాత్ | = | సంసారంనుండి, |
| ముక్తః | = | విముక్తుడవై, |
| నిజ | = | నీ, |
| హృదయస్థం | = | హృదయంలోనే ఉన్న, |
| దేవం ఏవం | = | పరమాత్ముడినే, |
| ద్రక్ష్యసి | = | దర్శించగలవు. |

**గురుదేవుల పాదపద్మములపై పరిపూర్ణమైన భక్తి కలవాడవై ఇంద్రియాలను, మనస్సును నిగ్రహించి అతి త్వరలోనే సంసారంనుండి విముక్తుడవై, నీ హృదయంలోనే ఉన్న పరమాత్ముడినే దర్శించగలవు.**

శ్రీ వ్యాసమహర్షి రచించిన “శ్రీ గురుగీత” లోని కొన్ని శ్లోకాలు:

మాయయే ఈ జగత్తుగా మారింది. ఆమెయే అవిద్య. ఆమె తమోరూపిణి. ఆ అవిద్యయే ప్రతిజీవి దేహంలో ఉంది. ఆ అవిద్యను పోగొట్టగల వెలుతురునే గురువు అంటారు. (శ్రీగురుగీత 14)

ఎవరి పాదపద్మముల జంట సుఖదుఃఖాలు, రాగద్వేషాలు వంటి ద్వంద్వాల వల్ల కలిగే తాపాలను పోగొడుతుందో, సంసార సముద్రాన్ని దాటిస్తుందో, అట్టి గురువుకు ప్రణామం. (శ్రీగురుగీత 15)

‘గు’ అంటే చీకటి. ‘రు’ అంటే వెలుతురు. అజ్ఞానాన్ని మ్రింగివేసే పరబ్రహ్మము గురువే, సంశయం లేదు. (శ్రీగురుగీత 30)

‘గు’ అంటే గుణాతీతుడు. ‘రు’ అంటే రూపాతీతుడు. గుణము, రూపమూ లేని పరబ్రహ్మ స్వరూపుడు కనుక ఆయనను “గురువు” అన్నారు. (శ్రీగురుగీత 32)

**త్వం పితా త్వం చ మే మాతా త్వం బంధుః త్వం చ దైవతమ్ ।**
**సంసార ప్రీతి భంగాయ తుభ్యం శ్రీ గురవే నమః ॥** (శ్రీగురుగీత 50)

నీవు నాకు తండ్రి, తల్లి, బంధువు, నీవే నాకు దైవం. ఈ సంసారంమీద గల ప్రీతిని పోగొట్టే శ్రీ గురువునకు నమస్కారము.

## శ్రీ నాన్నగారు

ఆఖరి శ్లోకంలో ఆచార్యులవారు మీకు అత్యంత విలువైన ఆశీర్వాదాన్ని ఇచ్చారు.

మీరు గురువు మీద అపారమైన భక్తితో, అచంచల విశ్వాసంతో మనస్సును, ఇంద్రియాలను నిగ్రహించి, అంతర్ముఖులై ఆత్మసాక్షాత్కారాన్ని పొంది జీవన్ముక్తులు అవుతారు.

✹ ✹ ✹



